JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 09-07-2026
Medchal - Malkajgiri । Thursday 09-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 38
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 38 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





# భారత్.. ఇండోనేషియా సంబంధాల్లో కొత్త అధ్యాయం

- చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించడం అంటే కేవలం కట్టడాలను కాపాడటం మాత్రమే కాకుండా, తరతరాలకు స్ఫూర్తినిచ్చే సంప్రదాయాలను నిలబెట్టడం

**జయభేరి, న్యూఢిల్లీ:**

ప్రధాని నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటన విజయవంతంగా ముగిసింది. పర్యటన ముగిసిన సందర్భంగా సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, భారత్..ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టాయని పేర్కొన్నారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో చూపిన ఆత్మీయతకు, అక్కడి ప్రజలు అందించిన ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య భవిష్యత్ భాగస్వామ్యానికి ...మిగతాది 2 లో



# ఆరేళ్లలో 67 లక్షల సైబర్ నేరాలు

2 లో

# కెనడా హైకమిషనర్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



- కెనడా పర్యటనకు సీఎం నేతృత్వంలోని బృందానికి ఆహ్వానం
- కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులను తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఆహ్వానించిన సీఎం
- రాష్ట్ర ప్రగతి దిశ, ఉద్యోగ కల్పనపై ప్రశంసలు కురిపించిన కెనడా హైకమిషనర్

**జయభేరి, హైదరాబాద్:**

కెనడా హైకమిషనర్ టు ఇండియా క్రిస్ కూటర్ బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెనడాతెలంగాణ మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందాన్ని కెనడా పర్యటనకు రావాలని హైకమిషనర్ క్రిస్ కూటర్ ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణలో చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ముఖ్యంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను ఇరువురు చర్చలు జరిపారు. తెలంగాణకెనడా మధ్య పెరుగుతున్న పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలను ప్రస్తావించిన క్రిస్ కూటర్, ఇటీవల కెనడాకు చెందిన ప్రముఖ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్, హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, సీఐబీసీ (సీఐబీసీ) హైదరాబాద్‌లో తన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ప్రారంభించడం వంటి పరిణామాలు తెలంగాణపై కెనడా ...మిగతాది 2 లో



# బెంగాల్‌లో 11 ఏళ్ల బాలిక గ్యాంగ్ రేప్ రేపిస్ట్ ఎన్‌కౌంటర్

**జయభేరి, బెంగాల్ :**

పశ్చిమ్ బెంగాల్‌లోని బరుయ్‌పుర్‌లో 11 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుల్లో ఒకడైన ప్రభాస్ మోండల్‌ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. బుధవారం తెల్లవారుజామున సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం నిందితుడ్ని తీసుకెళ్లిన సమయంలో.. తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఓ పోలీసు దగ్గర తుపాకీ లాక్కొని పరిపోవడానికి యత్నించిన నిందితుడు.. కాల్పులు కూడా జరిపినట్టు పేర్కొన్నారు. దీంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో గాయపడిన అతడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తునకు సిట్ వేసిన బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి.. 72 గంటల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు.


# విద్యార్థులకు హాస్టళ్లు.. గురుకులాలలో డైట్ ఛార్జీలు పెంపు



- రాష్ట్రంలోని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ కోసం రూ.100 కోట్లు కేటాయిస్తూ చంద్రబాబు నిర్ణయం
- ఎంజేపీ స్కూళ్ల శాశ్వత భవనాలకు ఐదు వందల కోట్లు మంజూరు

**జయభేరి, విజయవాడ, జూలై 8 :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలలో మెస్ ఛార్జీలు పెంచాలని నిర్ణయించింది. ముఖ్మమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయం వేదికగా సంక్షేమ శాఖల మంత్రులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు డైట్ ఛార్జీలను 10 శాతం పెంచి ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాలలో మౌలిక సౌకర్యాలు అభివృద్ధి చేయాలన్న సీఎం.. ఎంజేపీ స్కూళ్ల శాశ్వత భవనాలకు ఐదు వందల కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించారు. మరోవైపు పెంచిన డైట్ ఛార్జీలను ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే వర్తింపజేయాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. అలాగే సంక్షేమ శాఖల విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున గురుకులాలు నిర్మించాలని.. ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ...మిగతాది 2 లో



2 లో

# లేదంటే ఓటు గల్లంతు

- ఆ తేదీలోపు ఎన్యూమరేషన్ పత్రం తిరిగి ఇవ్వాలి

**జయభేరి, హైదరాబాద్ :**

ఓటర్లకు అలర్ట్.. ప్రస్తుతం తెలంగాణలో సర్ వేగంగా జరుగుతుంది. ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారాలు ప్రతి ఇంటికి చేరుకున్నాయి. అయితే చాలా మంది ఆ ఫారాలను ఇప్పటి వరకు తిరిగి బీఎల్‌ఓలకు ఇవ్వలేదు. త్వరగా వాటిని ఇవ్వకపోతే మీ ఓటు గల్లంతవ్వడం ఖాయం. రాష్ట్రంలో ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును భద్రపరుచుకునేందుకు వీలుగా ఎన్నికల సంఘం అందిస్తున్న 'ఎన్యూమరేషన్ పత్రాలను' ఈ నెల 24వ తేదీలోపు ఖచ్చితంగా నింపి సంబంధిత బీఎల్‌ఓ (BLO)లకు అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ శిక్షణ నోడల్ అధికారి చెన్నయ్య స్పష్టం చేశారు. ఒకవేళ గడువులోగా ఈ పత్రాలను సమర్పించకపోతే ఓటర్ల జాబితాలో పేరు తొలగించబడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

**ముసాయిదా తర్వాత కొత్త ఓటుకే ఛాన్స్!**

ఎన్యూమరేషన్ పత్రం సమర్పించని వారు, ఈ నెల 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాత కేవలం 'ఫారం 6' ద్వారా మాత్రమే కొత్త ఓటరుగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెన్నయ్య తెలిపారు.



# పవన్ కళ్యాణ్ అభిమాని నిరంజన్ మృతి

...మిగతాది 3 లో

జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న హనుమకొండకు చెందిన పవన్ కళ్యాణ్ వీరాభిమాని పొనుగంటి నిరంజన్ (17) మృతి చెందారు. జన్యుపరమైన వ్యాధి కారణంగా ఎదుగుదల లోపించి.. మంచానికే పరిమితమైన నిరంజన్‌ను గత నెలలో పవన్ పరామర్శించారు. ఇటీవల అతడి ఆరోగ్యం మరింత క్షీణించడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి నిరంజన్ కన్నుమూశారు.



# తెలంగాణ నీళ్లను గురు దక్షిణగా ఆంధ్రకు వదులుతున్న రేవంత్

- హరీష్ రావు

నదులల్లో నీళ్లు పుష్కలంగా ప్రవహిస్తున్న..నీళ్లుండి మోటార్లు నడపకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్సీ.. నీళ్ల మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఇద్దరూ ఫెయిల్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలపై మాజీ మంత్ర, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేవాదుల దగ్గర మోటర్లను ఎందుకు ఆన్ చేయడం లేదంటూ ప్రశ్నించారు. చంద్రబాబుకు గురు దక్షిణగా తెలంగాణ వాడుకోవాల్సిన నీళ్లను ..ఆంధ్రకు రేవంత్ వదులుతున్నాడని ఆరోపించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## కెనడా హైకమిషనర్ తో సీఎం భేటీ

కంపెనీల నమ్మకం, విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనమని అన్నారు. దాంతోపాటు, ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్యాపిటల్ సంస్థ సీపీపీ ఇన్వెస్ట్ మెంట్స్ హైదరాబాద్‌కు చెందిన సీటీఆర్ ఎల్ఎస్(CtrlS) డేటా సెంటర్స్ తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని ఒక బిలియన్ కెనడియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం తెలంగాణ పెట్టుబడి సామర్థ్యాన్ని మరింత బలపరిచిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన పురోగతిని క్రిస్ కూటర్ బృందానికి వివరించారు. ముఖ్యంగా ప్రపంచంలోని ఫార్చ్యూన్500 కంపెనీల గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీలు) హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మూసీ నది పునరుద్ధరణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని సీఎం రేవంత్ వివరించారు. నదీ తీరాన్ని అభివృద్ధి చేసి కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అలాగే రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని కోరారు. తెలంగాణను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం వెల్లడించారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. ఇదే తరహాలో కెనడాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు కలిసి హైదరాబాద్‌లో మల్టీయూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న రెండో తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్లో పాల్గొనాలని కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడిన హైకమిషనర్ క్రిస్ కూటర్, తెలంగాణ ప్రభుత్వం దూరదృష్టితో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. ఉద్యోగాల కల్పన, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అనుసరిస్తున్న విధానం ఆదర్శప్రాయమని కొనియాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులైన యువశక్తి తెలంగాణకు మరింత బలం చేకూరుస్తోందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కెనడా అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చిన క్రిస్ కూటర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెనడా పర్యటనకు ఆహ్వానించారు. రాబోయే నెలల్లో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చి ఇంధన రంగం, పట్టణాభివృద్ధి, రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ, ఈ అండ్ సీ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## భారత్.. ఇండోనేషియా సంబంధాల్లో

బలమైన పునాది వేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో రక్షణ, భద్రత, సముద్ర సహకారం, కీలక, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలు, కృత్రిమ మేధ (AI), డిజిటల్ ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి వంటి అనేక కీలక రంగాల్లో సహకారాన్ని విస్తరించే దిశగా చర్చలు జరిగాయి. భౌగోళిక, వ్యూహాత్మక అంశాలతో పాటు ఆర్థిక సహకారాన్ని కూడా మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఇరు దేశాలు ముందుకు సాగుతున్న సంకేతాలు కనిపించాయి. ఈ పర్యటనలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఘట్టంగా యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ప్రంబనన్ ఆలయ సముదాయం పునరుద్ధరణ, పరిరక్షణ ప్రాజెక్టును ప్రధాని మోదీ, అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కలిసి ప్రారంభించారు. భారతదేశం.. ఇండోనేషియా మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న నాగరికత, సంస్కృతి, ఆధ్యాత్మిక అనుబంధానికి ఇది ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించడం అంటే కేవలం కట్టడాలను కాపాడటం మాత్రమే కాకుండా, తరతరాలకు స్ఫూర్తినిచ్చే సంప్రదాయాలను నిలబెట్టడమని ఆయన అభివర్ణించారు. భారత్ ఈ వారసత్వ పరిరక్షణ కార్యక్రమంలో భాగస్వామి కావడం గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. ఉమ్మడి సాంస్కృతిక మూలాలను గౌరవిస్తూ, గతాన్ని సంరక్షించుకుంటూనే భవిష్యత్‌ను కలిసి నిర్మించాలనే సంకల్పంతో ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

ఇండోనేషియాలో నివసిస్తున్న భారతీయులకు ఈ భాగస్వామ్యం మరింత ప్రయోజనం చేకూరుస్తుందని కూడా చెప్పారు. పర్యటనలో మరో ముఖ్య ఘట్టంగా ఇండోనేషియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. భారత్, ఇండోనేషియా దేశాలను శతాబ్దాల చరిత్ర, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలు బలంగా కలిపి ఉంచాయని పేర్కొంటూ, స్నేహం, సహకారం, ఉమ్మడి అభివృద్ధి ఆధారంగా భవిష్యత్‌ను నిర్మించేందుకు కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన "గంగామహాకామ్ విజన్" అనే కొత్త భాగస్వామ్య దిశను ప్రస్తావించారు. ఈ దృష్టికోణంలో నాగరికతల అనుబంధం, ఉమ్మడి అభివృద్ధి, భద్రతవ్యూహాత్మక విశ్వాసం, సముద్ర శ్రేయస్సు, గ్లోబల్ సౌత్ దేశాల స్వరానికి ప్రాధాన్యం వంటి ఐదు ప్రధాన స్తంభాలను ప్రతిపాదించారు. ఇండోనేషియా 2022 జీ20 అధ్యక్షత, భారత్ 2023 జీ20 అధ్యక్షత సందర్భంగా గ్లోబల్ సౌత్ దేశాల సమస్యలను ప్రపంచ వేదికపై ముందుకు తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేసిన మోదీ, భవిష్యత్తులో కూడా ఈ దిశగా కలిసి పనిచేస్తామని తెలిపారు. భౌగోళికంగా ఢిల్లీ, జకార్తా వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, సముద్ర మార్గంలో రెండు దేశాల మధ్య దూరం సుమారు 150 కిలోమీటర్లేనని మోదీ పేర్కొన్నారు. ఈ సముద్ర అనుబంధమే భవిష్యత్ వ్యూహాత్మక, వాణిజ్య, భద్రతా భాగస్వామ్యానికి కేంద్రబిందువుగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యటనలో ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన "అదిపురా స్టార్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా"ను ప్రదానం చేశారు. ఈ గౌరవాన్ని వినయంగా స్వీకరిస్తున్నానని, ఇది తనకే కాదు భారత ప్రజలందరికీ దక్కిన గౌరవమని మోదీ అన్నారు. ఈ అవార్డు రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆత్మీయ సంబంధాలకు గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొంటూ, అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ఇండోనేషియా ప్రభుత్వం, అక్కడి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా చూస్తే, ఈ పర్యటన కేవలం దౌత్య మర్యాదలకే పరిమితం కాలేదు. రక్షణ నుంచి డిజిటల్ సాంకేతికత వరకు, సాంస్కృతిక వారసత్వం నుంచి సముద్ర భద్రత వరకు, గ్లోబల్ సౌత్ సహకారం నుంచి ప్రజల మధ్య బంధాల వరకు విస్తరించిన సమగ్ర భాగస్వామ్యానికి ఇది కొత్త దిశను నిర్దేశించింది. భారత్ఇండోనేషియా సంబంధాలను మరింత వ్యూహాత్మకంగా, దీర్ఘకాలికంగా బలోపేతం చేసే పర్యటనగా ఇది నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గురుకులాలలో డైట్ ఛార్జీలు పెంపు

రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల మెయింటెనెన్స్ గ్రాంట్ కోసం రూ.100 కోట్లు కేటాయిస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల లబ్ధిని అందించటంతో పాటుగా వారి జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని.. వారికి మరింత ఆదాయం సమకూర్చేందుకు మార్గాలను అన్వేషించాలని చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటుగా మెప్మా, డ్వాక్రా పథకాల ద్వారా ఉపాధి కల్పించాలని.. పీ4 ద్వారా సాయం అందించాలని స్పష్టం చేశారు. హార్టీకల్చర్ పంటలతో పాటుగా రబ్బర్, కాఫీ, పసుపు వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో కల్లుగీత కార్మికులకు, క్వారీల్లో వడ్డెర్లకు కోటా కేటాయించాలన్న సీఎం చంద్రబాబు నాయుడు.. నాయీ బ్రాహ్మణులు, మత్స్యకారులు, చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ విధానాలను మిగతా కార్పొరేషన్లు కూడా అవలంబించేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు డోలాబాల వీరాంజనేయ స్వామి, సవిత, గుమ్మడి సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆరేళ్లలో 67 లక్షల సైబర్ నేరాలు



ప్రపంచం మొత్తం మీద డిజిటల్ డేటాలో భారత దేశం ఇప్పుడు 20 శాతానికి చేరుకుంది. డిజిటల్ చెల్లింపులు, స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరగడంతో సైబర్ నేరాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు కృత్రిమ మేధస్సు (ఏఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీ ఉపయోగించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో ప్రజలను మోసగిస్తున్నారు. కొన్ని కోట్లు కొల్లగొడుతున్నారు. 2019 2025 వరకు 67.32 లక్షల సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండింట మూడొంతులు అంటే 43.22 లక్షల కేసులు గత రెండేళ్ల లోనే నమోదు కావడం గమనార్హం. గత ఆరేళ్లలో సైబర్ మోసాల ద్వారా సుమారు రూ. 55,000 కోట్లు బాధితులు నష్టపోయారు. అంటే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు సైబర్ మోసాల ఖాతాకే చేరాయి. అంతేకాదు అశ్లీల పదజాలం కూడా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లద్వారా వ్యాప్తి చెందుతోంది. రేప్ వీడియో, చైల్డ్ వీడియో ద్వారా పిల్లలకు సంబంధించిన అసభ్యకరమైన పదజాలంతో పెయిడ్ యాడ్స్ కనిపించాయని వాటిని క్లిక్ చేసిన వినియోగదారులు టెలిగ్రామ్ ఛానెళ్లకు మళ్లించి ఆ వీడియోలను విక్రయిస్తున్నారని ఓ మీడియా సంస్థ బయటపెట్టగా ప్రభుత్వం స్పందించి ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత మెటా సంస్థను గట్టిగా హెచ్చరించింది. ఇలాంటి సంఘటనలు చాలా పెద్ద సమస్యలో ఓ చిన్నభాగం మాత్రమే. రోజురోజుకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అంతకన్న వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ చట్టాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటివరకు డీప్‌ఫేక్స్, ఇతర సమస్యలను నివారించడానికి ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)చట్టంపై ఆధారపడుతూ వచ్చింది అయితే ఏఐ వ్యవస్థలు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, సాంకేతికతను సురక్షితంగా మార్చడానికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ పర్యావరణ వ్యవస్థ మనకు ఏర్పాటైంది. ఇందులో ఆధార్, యుపిఐ, ఓఎన్‌డిసి వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. ఆధార్ వల్ల ప్రజల గుర్తింపు స్థిరీకరణ జరగడమే కాక, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు నేరుగా చేరడానికి ఉపయోగపడుతుంది. యుపిఐ అన్నది తక్షణ చెల్లింపుల వ్యవస్థ. స్మార్ట్‌ఫోన్ ద్వారా చిల్లర వ్యాపారం నుండి పెద్దపెద్ద లావాదేవీల వరకు సెకన్లలో డబ్బులు పంపడానికి, స్వీకరించడానికి తోడ్పడుతోంది. ఓఎన్‌డిసి వాణిజ్య రంగాన్ని వికేంద్రీకరించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఓపెన్ నెట్‌వర్క్. దీని ద్వారా చిన్న వ్యాపారులు, స్థానిక విక్రేతలు, కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించవచ్చు. ఈ ప్లాట్‌ఫారాలన్నీ సామాన్యుల దైనందిన జీవితాన్ని ఎంతో సులభతరం చేశాయి. ఇవి పాలనా వ్యవహారాలను, ఆర్థిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ సౌకర్యాలు ఎలా ఉన్నా డిజిటల్ దాడులు విస్తరించే ప్రమాదాలు కూడా పెరిగాయి. కృత్రిమ మేధస్సు సహాయంతో జరిగే సైబర్ దాడులను గుర్తించడం, వాటిని నివారించడం చాలా కష్టంగా మారుతోంది. ఈ దాడులు బ్యాంకింగ్, టెలికమ్యూనికేషన్స్, రక్షణ (డిఫెన్స్), విద్యుత్, ఆరోగ్య భద్రతరంగాలకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారంగానే సైబర్ నేరగాళ్లు అత్యంత నమ్మదగిన ఫిషింగ్ ఈ మెయిల్స్, డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ గుర్తింపులు, అధునాతన మాల్వేర్‌ను సృష్టిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ కనిపెట్టలేని విధంగా నిరంతరం తమ కోడ్‌ను మార్చుకునే మాల్‌వేర్‌ను సృష్టిస్తున్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఏఐ టూల్స్ సహాయంతో హ్యాకర్లు సాఫ్ట్‌వేర్‌లో లోపాలను అందరికన్నా ముందుగానే పసిగట్టి దాడులకు పాల్పడుతున్నారు. వీటిని నివారించడం సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పెద్ద సవాలుగా మారింది.

సైబర్ ముప్పులను నివారించడానికి ప్రభుత్వం అనేక ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. ఇండియా ఏఐ మిషన్‌తోపాటు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి ఇన్) వ్యవస్థను బలోపేతం చేసింది. జీరో ట్రస్ట్ అనే పద్ధతిని స్వీకరించింది. సాధారణ భద్రత విధానాల్లో ఒకసారి నెట్‌వర్క్ లోకి ప్రవేశించిన ఎవరినైనా లేదా ఏదైనా పరికరాన్ని నమ్ముతారు. కానీ జీరో ట్రస్ట్ విధానంలో, నెట్‌వర్క్ లోపల ఉన్నా లేదా బయట ఉన్నా ఎవరినీ గుడ్డిగా నమ్మరు. ఆ వినియోగదారుడి పనికి అవసరమైన డేటా, ఫైల్స్ లేదా అప్లికేషన్‌కు మాత్రమే అనుసంధానం కలుగుతుంది. దీనివల్ల డేటా రక్షణ కలుగుతుంది. సైబర్ దాడుల నుండి డేటాను కాపాడుకోడానికి ప్రభుత్వ ఏజెన్సీలు సిఇఆర్‌టి ఇన్ వంటి సంస్థలు భద్రతా లోపాలను గంటల వ్యవధి లోనే పరిష్కరించాలన్న నిబంధనలు తీసుకు వస్తున్నారు. భారత్ ఏ దేశంపై ఆధార పడకుండా ఇప్పుడు స్వంతంగా కృత్రిమ మేధస్సు సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. రూ.10,300 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం ఇండియా ఏఐ మిషన్‌ను ప్రారంభించింది. లక్షలాది మందికి ఉపయోగపడేలా జిపియు కంప్యూటింగ్ (గ్రాఫింగ్ ప్రాసెసింగ్ యూనిట్), స్టార్టప్ ఫండింగ్ వ్యవస్థలను అందుబాటు లోకి తెస్తోంది.

ఏదేమైనా ఈ ప్రయత్నాలన్నీ విచ్ఛిన్నంగానే ఉంటున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 1,01,118 సైబర్ నేరాలు నమోదయ్యాయి. కాగా తెలంగాణలో వాటి సంఖ్య 27,230. అంటే తెలంగాణ వాటానే 27%గా నమోదయింది. రాష్ట్రంలో రోజుకు సగటున 75 సైబర్ నేరాల కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో కర్ణాటకలో 21,993 కేసులు నమోదై రెండోస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల బారిన పడుతున్న బాధితుల్లో తెలంగాణ వాసులు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది. జనాభా ఆధారంగా రాష్ట్రంలో క్రైమ్‌రేట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 71.1గా నమోదు అయింది. రెండోస్థానంలో ఉన్న కర్ణాటకలో అది 32.2. దేశవ్యాప్త సగటు 7.4 మాత్రమే ఉంది. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత విషయంలో పోలీస్‌శాఖ వాదన మరోలా వినిపిస్తోంది. తమకు అందుతున్న ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తుండటంతోనే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా కేసుల నమోదులో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు అభియోగపత్రాల నమోదు రేటులో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సగటు కేవలం 16.2 కాగా దేశవ్యాప్త సగటు ఏకంగా 31.6గా నమోదయింది. వీటికి సంబంధించిన ఏజెన్సీలు వేటికి అవే స్వతంత్రంగా పని చేస్తున్నాయి తప్ప సమన్వయం కనిపించడం లేదు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (14 సి)ను బలోపేతం చేయడం ద్వారా కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య సమన్వయం పెరిగి సైబర్ బెదిరింపుల ముప్పును ఎదుర్కోగలుగుతారు. భారత దేశం తన ఏఐ వ్యూహంలో కేవలం సాంకేతికతను అభివృద్ధి చేయడమే కాక, దానిని సైబర్ దాడుల నుండి రక్షించుకునే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవడం తప్పనిసరి.

## లేదంటే ఓటు గల్లంతు

**ఓటర్ల సందేహాలు - అధికారి ఇచ్చిన స్పష్టత**

**పత్రాలు అందకపోతే ఏం చేయాలి?:** ఎన్యూమరేషన్ పత్రం ఇంకా అందని వారు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా 'ఈసీఐనెట్' (ECInet) యాప్ ద్వారా తమ పోలింగ్ బూత్ బీఎల్‌ఓ నెంబరును సేకరించి ఫోన్ చేయవచ్చు. బీఎల్‌ఓలు స్పందించని పక్షంలో ఈఆర్డీఓ (ERDO) సిబ్బందికి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

**పాత రికార్డుల (SR-2002) కాలమ్స్ ఎలా నింపాలి?**

ఎస్ఆర్2002 రికార్డుల ప్రకారం ఓటు ఉన్నవారు మొదటి బాక్సును, అప్పట్లో ఓటు లేనివారు తమ తల్లిదండ్రులు లేదా తాత, నాయనమ్మల వివరాలను రెండో బాక్సులో పూరించాలి. ఏ వివరాలూ తెలియని వారు మూడో బాక్సు కాలమ్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది.

**చిరునామా మార్పులు:** ఈ నెల 31న ముసాయిదా నోటిఫికేషన్ విడుదలయ్యాక, చిరునామా మార్పులు కోరుకునే వారు 'ఫారం 8' ద్వారా ప్రస్తుతం నివాసముంటున్న ప్రాంత ఈఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

**జిల్లాల వివరాలు:** ఎస్ఆర్2002 కాలమ్‌లో పాత జిల్లాలు, పాత నియోజకవర్గాల వివరాలనే నమోదు చేయాలి. రాష్ట్రం కాలమ్‌లో ఆంధ్రప్రదేశ్ అని ఉన్నా, పొరపాటున తెలంగాణ అని రాసినా ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

**ఇతర పత్రాలు అవసరం లేదు:** ఎన్యూమరేషన్ పత్రంతో పాటు ఎలాంటి అదనపు ప్రమాణ పత్రాలు (Affidavits) జతచేయాల్సిన అవసరం లేదు. దరఖాస్తుపై ఏవైనా అనుమానాలు ఉంటే అధికారులే నేరుగా నోటీసులు ఇస్తారని, ఆ సమయంలో అడిగిన పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని నోడల్ అధికారి వివరించారు. ద్వంద్వ ఓట్లు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని, విదేశీ పౌరసత్వం ఉన్నవారు ఈ పత్రాన్ని నింపకూడదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువు ముగిసేలోగా తమ వివరాలను సరిచూసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

### మహిళలకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త..

# కొత్త కార్యక్రమానికి శ్రీకారం



- **మహిళా సంఘాలకు ఫెర్టిలైజర్ లైసెన్సులు అందించనుంది. గ్రామాల్లోని మహిళలను ఎంపిక చేసి ఎరువులు సరఫరా చేసే బాధ్యతలను అప్పగించనుంది. ఈ కార్యక్రమం అమలు కోసం ప్రణాళికలు రచిస్తోంది.**

✍ జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాలకు ఎరువుల పంపిణీ బాధ్యతలను అప్పగించనుంది. రైతులకు ఎరువులు సరఫరా చేసే బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనుంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో చురుగ్గా ఉన్న మహిళా సంఘాలను గుర్తించనుంది. వీరికి ఫెర్టిలైజర్ లైసెన్సులు అందించనుంది. రాష్ట్రంలో దాదాపు 4.67 లక్షల మహిళా సంఘాలు ఉన్నాయి. వీరిలో కొంతమందిని ఎంపిక చేసిన లైసెన్స్ అందించనున్నారు. అలాగే వీరికి యూరియా యాప్ వినియోగంపై ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. మహిళా సంఘాల కోసం 8,126 సొంత భవనాలను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఈ కేంద్రాల్లోనే ఎరువులు నిల్వ చేసుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రతీ ఏటా 40 లక్షల టన్నుల ఎరువులు రైతులకు సరఫరా అవుతున్నాయి. వ్యవసాయ సహకార సంఘాలతో పాటు ప్రైవేట్ ఎరువు దుకాణాల ద్వారా రైతులు తీసుకుంటున్నారు. మహిళా సంఘాలకు ఈ బాధ్యతలను అప్పగించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. దీని వల్ల రైతులు తమ గ్రామంలోనే ఎరువులు కొనుగోలు చేయవచ్చు. ఇందుకోసం పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఒక్కో గ్రామంలో 5 నుంచి 10 వరకు మహిళా సంఘాలు ఉన్నాయి. వీరిలో ఆసక్తిగల సంఘాలను అధికారులు ఎంపిక చేయనున్నారు. వీరికి ఎరువులను విక్రయించే బాధ్యతలను అప్పగించనున్నారు. దీని వల్ల రైతులతో పాటు మహిళా సంఘాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది.

ఈ కార్యక్రమం అమలు కోసం ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులతో పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు సమావేశమయ్యారు. మొదటి విడతలో ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో అమలు చేశారు. అనంతరం అక్కడ వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను బట్టి అన్ని జిల్లాల్లో అమలు చేస్తారు. ఇప్పటికే ప్రభుత్వం రైతు వేదికల ద్వారా విత్తనాలను సరఫరా చేసే కార్యక్రమం చేపట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు అధికారులు ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం ప్రారంభించారచు. అయితే పలు రైతు వేదికల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాటు విత్తనాలను భద్రపర్చేందుకు గిడ్డంగులు లేవు. దీంతో విత్తనాల పంపిణీ కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది.

# యాదగిరీశుడికి నిత్యపూజల వైభవం





**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 08 :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.15,36,745 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,04,900,బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,05,900, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.60,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,52,250, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,87,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.51,200,ప్రసాద విక్రయం ద్వారా రూ.5,15,580, కల్యాణకట్ట ద్వారా రూ.25,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 08 :**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ పట్టణ,మండల అధ్యక్షుడు ముఖ్యర్ల మల్లేష్ యాదవ్,మంగ సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వం అన్నదాతలకు రైతు భరోసా నిధులను విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యల ఫ్లెక్సీకి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతిగా ఉంటుందని, ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించి ఆదుకుందని కొనియాడారు. గత ప్రభుత్వాల వల్ల కాకుండా కాంగ్రెస్ హయాంలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. నిధుల విడుదల ద్వారా రైతాంగంలో కొత్త ఉత్సాహం నెలకొందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గుండ్లపల్లి భరత్ గౌడ్, చీర శ్రీశైలం, కానుగు బాలరాజు గౌడ్, సుడుగు జీవన్ రెడ్డి, కాల్నే నర్సింహులు, గౌళికార్ రాజేష్, సలాం, పన్నీరు భరత్, గుండు నర్సింహ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో ఉద్యోగికి తీవ్ర గాయాలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 08:**

యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో విద్యుత్ షాక్‌తో విధులు నిర్వహిస్తున్నఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యుత్ అధికారులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం పెద్దకందుకూరు గ్రామంలో ఆర్టీజన్‌గా విధులు నిర్వహిస్తున్న ధీరావత్ రమేష్ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర రిపేరు చేసుకున్న సమయంలో ఎల్సీ తీసుకున్నా అది ఆఫ్ కాకపోవడంతో విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా స్థానికులు అతనిని ఆస్పత్రికి తరలించారు.

# లోకాన్ని వీడిన చోటా గబ్బర్ సింగ్

- పవన్ వెళ్లి కలిసొచ్చి నెల కూడా కాలేదు..

**జయభేరి, హనుమకొండ :**



ఒక అభిమానిని కలవడానికి స్టార్ హీరోగా కాదు.. అప్పుడిలా అతడి ఇంటి గుమ్మం దాటారు పవన్ కళ్యాణ్. మంచానికే పరిమితమైన ఆ బాలుడి చేతిని పట్టుకుని ధైర్యం చెప్పారు. "మనిద్దరం కలిసి OG సినిమా చూద్దాం.. OG 2 వస్తే నువ్వే నా స్పెషల్ గెస్ట్" అని ప్రేమగా మాటిచ్చారు. కానీ ఆ కల నిజమయ్యేలోపే.. ఆ అభిమాని ఈ లోకాన్ని విడిచిపెట్టాడు. హనుమకొండ హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల పొనుగంటి నిరంజన్ గత కొంతకాలంగా అరుదైన న్యూరోమస్క్యులర్ జన్యు వ్యాధితో పోరాడుతున్నాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరిన అతడి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించింది. వైద్యుల ప్రయత్నాలు ఫలించక బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు.

ఈ వార్తతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. నిరంజన్‌కు పవన్ కళ్యాణ్ అంటే ప్రాణం. పవన్ పాటలు, డైలాగ్‌లతో చేసిన అతడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ విషయం పవన్ దృష్టికి చేరింది. వెంటనే జూన్ 17న స్వయంగా అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

కొద్దిసేపు అతడి పక్కనే కూర్చుని మాట్లాడారు. ప్రేమగా హత్తుకుని ధైర్యం చెప్పారు. "అందరూ నన్ను 'చోటా గబ్బర్ సింగ్' అని పిలుస్తారు" అని నిరంజన్ చెప్పినప్పుడు పవన్ కూడా చిరునవ్వుతో ఆనందం వ్యక్తం చేశారు. వెళ్లే ముందు బహుమతులు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తూ త్వరలో మళ్లీ కలుద్దామని చెప్పారు.

కొంత ఆర్థిక సాయం కూడా చేశారు. తనకు కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా.. ఆరోజే కుక్క పిల్లను అందించారు. అయితే ఆ ఆప్యాయ భేటీ జ్ఞాపకంగా మిగిలిపోగా.. కొన్ని రోజులకే నిరంజన్ మృతి చెందడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. ఒక అభిమాని చివరి కోరికను నెరవేర్చాలని కోరుకున్న హీరో.. ఇప్పుడు అదే అభిమానిని కోల్పోవాల్సి రావడం అభిమానులను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తోంది.

## బిజెపి తెలంగాణ రాష్ట్ర ధార్మిక సెల్ సలహాదారులుగా శంకర్ స్వామి నియామకం




**జయభేరి, దేవరకద్ర :**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ధార్మిక సెల్ రాష్ట్ర సలహాదారులుగా శంకర్ స్వామి ను ఏకగ్రీవంగా నియమించినట్లు బిజెపి ఎండోమెంట్ ధార్మిక రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్ అన్నార్ఘుల, రాష్ట్ర కోకన్వీనర్ నిరంజన్ దేశాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం శంకర్ స్వామి శ్రీ మాణికేశ మహాసంస్థానం దామర్ చెడ్ తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత మార్గదర్శకులుగా కొనసాగుతున్నారు. ఆయనను భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ ధార్మిక తెలంగాణ రాష్ట్ర కమిటీ సలహాదారులుగా నియమించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ సెల్ ధార్మిక రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర కోకన్వీనర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి అమూల్యమైన సహకారాన్ని అందించి, అవసరమైన సమయంలో తగిన సలహాలు, సూచనలు చేస్తూ ప్రజాప్రయో జనాలకు అవసరమైన ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజా సేవ పట్ల పూర్తి బాధ్యతతో ముందుకు సాగాలని వారు కోరారు.

## ప్రజలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- కౌన్సిలర్ శ్రీలత రమేష్



**జయభేరి, మేడ్చల్ :**

పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిది పథకం ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎల్లంపేట్ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీలత రమేష్ తెలిపారు. బుధవారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధికి చెందిన కే. రాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CM రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన రూ.28,000 చెక్కును ఎల్లంపేట్ మున్సిపల్ కౌన్సిలర్ నీరుగంటి శ్రీలత రమేష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీలత రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోంది. వైద్య చికిత్సలు, అత్యవసర అవసరాల కోసం ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు గొప్ప ఊరటనిస్తుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా తాము నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# యూరియా లభ్యతను మరింత సరళతరం చేసిన ప్రభుత్వం

- ఇక పై మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్ ప్రారంభం
- యాప్ లో బుకింగ్ చేసుకోలేనివారికి సులువైన మార్గం

**జయభేరి, దేవరకద్ర :**




రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయటం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయటం కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, ఆపరేటర్ సహాయంతో యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ, వ్యవసాయశాఖతో కలిసి ఈ కొత్త చొరవను ప్రారంభిస్తుంది.

**ఈసేవను పొందే విధానం..**

రైతు తన పట్టాదారు పాస్‌బుక్ (పి పి బి) నంబర్ తో సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించాలి. మీ సేవ ఆపరేటర్ రైతు వివరాలను సేకరించి, సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలను నమోదు చేస్తారు. రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేస్తారు.రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటిపి ను ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడి (బుకింగ్ ఐడి) జారీ చేయబడుతుంది.

**ముఖ్యమైన సూచనలు..**

మీ సేవ ద్వారా పొందిన బుకింగ్ ఐడి బుకింగ్ చేసిన తేదీని మినహాయించి 48 గంటలపాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

బుకింగ్ గడువు ముగిసేలోపు రైతులు ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాలి.

సబ్సిడీ యూరియా బుకింగ్‌ను అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారానే చేయాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

ఓటిపి అందుకోవడానికి రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ తో అనుసంధానమైన మొబైల్ నంబర్ యాక్టివ్‌లో ఉండేలా చూసుకోవాలి.కేవలం పదిరూపాయల నామ మాత్రపు సేవా రుసుముతో మీసేవ ద్వారా రైతులు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

ఏవైనా సందేహాలు లేదా సహాయం కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ), మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ) లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించవచ్చు.

ఈ సౌకర్యాన్ని రాష్ట్రంలోని రైతులందరూ వినియోగించుకొని, సబ్సిడీ యూరియాను అధికారిక బుకింగ్ విధానం ద్వారా పొందాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసధనంలో బీదలకు బియ్యం,నిత్యావసర సరుకులు అందజేత



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసధనంలో అజ్ఞాతవాసి దేవరకొండ నివాసి, పద్మశాలి నేత 10 మంది బీదకుటుంబాలకు బియ్యం, నిత్యావసరం సరుకులు కార్యవర్గ సభ్యులు మునిని వీరయ్య ద్వారా అందజేసినారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణ రెడ్డి మాట్లాడుతూ దేవరకొండ అజ్ఞాత పద్మశాలి నేత బీదలకు బియ్యం,నిత్యావసరం అందజేసి తన పేరు చెప్పకపోవడం వారి గొప్ప మనసుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో సహ అధ్యక్షులు గంగిడి నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఇజాక్, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి, కార్యవర్గం, కార్యవర్గ సభ్యులు, సభ్యులు, స్వీకరించిన వారి కుటుంబ సభ్యులు పాలుగొన్నారు.

## మలక్ పేట భారీ ఫ్లై ఓవర్ పనులను పరిశీలించిన జీహెచ్ఎంసి కమిషనర్

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ నల్గొండ క్రాస్ రోడ్స్ వద్ద రూ.690 కోట్లతో నిర్మిస్తున్న భారీ ఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరుకున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పనులను సమీక్షించి ఆగస్టు మొదటి వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ముసారాంబాగ్, మలక్పేట్, దిల్సుఖ్నగర్ మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గి కనెక్టివిటీ మెరుగుపడుతుంది. భద్రత కోసం క్రాష్ బారియర్లు, ఆధునిక వీధి దీపాలు, కింద ల్యాండ్స్కేపింగ్ పనులు కూడా చేపడుతున్నారు.


## ఆర్సిఓ ఈ.స్వప్న అక్రమాలపై విచారణ జరపాలి

**జయభేరి, దేవరకొండ :**



నల్గొండ జిల్లా బీసీ గురుకుల సొసైటీ ఆర్సిఓ ఈ.స్వప్న పై ఇదివరకే డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఎంజేపీ గురుకుల సొసైటీ సెక్రటరీ,ప్రిన్సిపల్ సెక్రటరీ లకు పిర్యాదు చేసిన విషయం తెలిసిందే.అదే పరంపరగా బుధవారం కలెక్టరేట్ ఆఫీస్ లో ఏంజేపీ బీసీ గురుకుల నల్గొండ జిల్లా ఆర్సి ఓ ఈ. స్వప్న యొక్క అక్రమాలు, అరాచకాల పై విచారణ జరపాలని నల్గొండ జిల్లా కలెక్టర్ శ్రీ బడుగు చంద్రశేఖర్ కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్,జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మి నారాయణ పిర్యాదు చేశారు. ఈ సందర్భముగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్సి ఓ ప్రధానంగా నల్లగొండ జిల్లాలో కావాలనే ఇంటర్మీడియట్ లోని సీఈసీ గ్రూపులో సీట్లు భర్తీ చేయకపోవడం, అహంకారపూరితమైన, కుట్రపూరితంగా,దురుద్దేశంతోవ్యవరించడం ,దురుసు ప్రవర్తన, కుల వివక్ష, ఇంటర్మీడియట్ అడ్మిషన్ విషయాల్లో పారదర్శకత లేకపోవడం, సమయపాలన పాటించకపోవడం, ప్రజలకు విద్యార్థులకు, బీసీ ఉద్యమ నాయకులకు అందుబాటులో ఉండకపోవడం,విద్యార్థులు వారి తల్లిదండ్రుల పై దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్యకరమైన పదజాలంతో రెచ్చిపోవడం, డేమోల పేరిట డబ్బు దన్నుకోవడం మరియు బీసీ గురుకుల లోనే పనిచేస్తే బీసీ వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు అని అన్నారు. ఈ ఫిర్యాదులో ఆమె చేసిన అక్రమాల చిట్టాను, అవినీతిని ప్రశ్నిస్తూ స్పష్టంగా కలెక్టర్ కి కల్సి వివరించారు.ఈ పిర్యాదు పత్రాన్ని మీడియా ముందు పెట్టారు.ఈ పిర్యాదు కలెక్టర్ పరిశీలించిన పిమ్మట ఆర్సిఓ అక్రమాలపై విచారణ జరిపిస్తామని కలెక్టర్ బీసీ సంక్షేమ సంఘానికి హామీ ఇచ్చారని ఒక వారం రోజుల్లోనే ఆమె పై తగు చర్యలు ఉంటాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఒక వేళ వారం రోజుల్లో ఆమెను సస్పెండ్ చేయకపోతే పెద్ద యెత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని వారు తెలియజేశారు.

## రామంచ రాజేందర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్లా



**జయభేరి, పరకాల, జులై 08:**

హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం నడికుడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రామంచ రాజేందర్ ప్రమాదవశాత్తు గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న చల్లా ధర్మారెడ్డి. వారికి మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. అలాగే రాజేందర్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రభుత్వం

- రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

సొంతింటి కలలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మధనాపురం మండలం దుప్పల్లి లో బుధవారం స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తో కలిసి దాదాపు 60 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో కూడా పాల్గొన్నారు. అనంతరం అడ్డాకుల మూసాపేట, కొత్తకోట, మధనాపురం మండలాల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ లను కూడా రాష్ట్ర పశుసంవర్ధక, యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జిఎంఆర్ తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్




చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... దేవరకద్ర నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లతో పాటు అదనంగా ఇండ్లను కేటాయించాలని, కౌకుంట్ల మండల కేంద్రంలో మండల కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. అలాగే సరళాసాగర్ ప్రాజెక్టులో చేపల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరిని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రతిపాదనల పట్ల సానుకూలంగా మంత్రులు స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్ఎస్ పాలకులు పాలమూరు రంగారెడ్డిని గాలికి వదిలేసారని జిఎంఆర్ బిఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలమూరు జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను సస్య శ్యామలం చేస్తామన్నారు.అనంతరం మంత్రివర్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ అహర్నిశలు కష్టపడుతు న్నారన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి బిఆర్ఎస్ పాలకులు దేవరకద్ర నియోజకవర్గంలో జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజీ, కోర్టు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. తదనంతరం మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...తొలి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడత గ్రామీణ ప్రాంతాలకు 2 లక్షల ,50 వేల ఇండ్లు మంజూరు చేసామని, నగరాలలో క్యూర్ పరిధిలో 1 లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అంతేకాక 3, 4 విడతల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి, ఇండ్లు లేని వారి సొంతింటి కళను, ఇందిరమ్మ ప్రభుత్వం తీరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు భరోసా నిధుల విడుదలతో కాంగ్రెస్ సంబరాలు

**జయభేరి, తుర్కపల్లి, జూలై 08 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినందున మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిన, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి అన్ని హామీలను నెరవేర్చుకుంటూ వస్తున్నారని, ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లు మాత్రమే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేశారని, గత ప్రభుత్వంలో అభివృద్ధిలో వెనుకబడిన ఆలేరు ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అభివృద్ధిలో ముందు ఉంచుతున్నారని, సుమారు వందకు పైగా చెరువులను నింపి రైతుల పంటలు ఎక్కడ ఎండకుండా చేశారని, ప్రభుత్వం సన్నలకు 500 రూపాయల బోనస్ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా ప్రచార కార్యదర్శి భూక్య రాజారాం



నాయక్, సర్పంచులు సోమల వెంకటేష్, రాజశేఖర్ నాయక్, కర్రె మాధవి కరుణాకర్ గౌడ్, బానోతు బులి వీరన్న నాయక్, శివరాత్రి లావణ్య జహంగీర్, మహిళా శాఖ అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, నాయకులు బబ్బురి సాయికుమార్, బోరెడ్డి మహిపాల్ రెడ్డి, నారం రెడ్డి, సుదర్శన్ గౌడ్, బాలమల్లు యాదవ్, సముద్రాల వెంకటేష్ ,సురేష్ నాయక్, హనుమంత్ నాయక్, పల్లపు రమేష్, బొల్లారం జగదీష్, కోట జహంగీర్, తరుణ్ నాయక్ కొండం సత్తిరెడ్డి, అరిగే మైపాల్, సాప కిష్టయ్య, బాలు నాయక్, ప్రవీణ్, దండ్ల శ్రీను, ఆనందచారి, జివిలికపల్లి శ్రీనివాస్, దశరథ, నాగరాజు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు

- కాంగ్రెస్ నేతల ఘన నివాళి

**జయభేరి, మేడ్చల్ :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత ప్రజానాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం మేడ్చల్‌లో ఘనంగా నివాళులర్పించారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని కొనియాడారు. ఆయన పాలనలో అమలైన ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయానికి వైఎస్సార్ పాలన ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వైఎస్సార్ ఆశయాల దిశగా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని, ఆయన కలలను సాకారం చేయడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, సంక్షేమ భావనను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ 297 డివిజన్ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, 298 డివిజన్ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ, జాకట దేవరాజ్, కౌడే మహేష్ కురుమ, పెంజర్ల స్వామి యాదవ్, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, బత్తుల



మధుకర్ యాదవ్, మేడ్చల్ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఉదండపురం సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లవంగు రాకేష్ వంజరి, సీనియర్ నాయకులు కనకాల శివకుమార్ (బిపిటిరాజు), నడికొప్పు రంజిత్ ముదిరాజ్, గోమారం బాల్‌రెడ్డి, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, బొక్క రఘుపతి రెడ్డి, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ), చంద్రయ్య గౌడ్, నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్, పాలకుర్తి రాఘవేందర్ గౌడ్, పెగుడ శ్యాంరావ్, హనుమంత్ రెడ్డి, దుబ్బ రామస్వామి ముదిరాజ్, రామన్నగారి సంతోష్ గౌడ్, కాలేరు శ్రీకాంత్ వంజరి, సత్తి రెడ్డి, శివ, రామకృష్ణ, పానుగంటి మహేష్ కుమార్, మహమ్మద్ ఆరీఫ్, మహమ్మద్ ఇనాయత్ ఆలీ, విభూది యాదగిరి, ఆటో విజయ్, లక్ష్మణ్ గౌడ్, మోహన్ రెడ్డి, ప్రభు ముదిరాజ్, శ్రీరాం రెడ్డి, గణేష్, వేముల రంజిత్ రెడ్డి, కటిక వినయ్, సన్నీ కుమార్, ప్రమోద్, నర్సింహారెడ్డి, పాండు గౌడ్, ప్రకాష్‌రెడ్డి, విఠల్ గౌడ్, అవినాష్, సోను, శరత్, మారుతి, ప్రణీత్, పవన్, మణి, హేమంత్, కళ్యాణ్, చందు, నాని, మహిళా నాయకురాళ్లు ప్రేమలత, మల్లీశ్వరి, వినోద, రేణుక, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమ పాలనకు సరికొత్త భాష్యం చెప్పిన వైయస్సార్

- వైస్సార్సీపీ మాజీ మండలపార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ఈ బోనంగి గ్రామపంచాయతీ గౌతు లచ్చన్న జంక్షన్ లో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు బొద్దపు చిన్నారావు ఆధ్వర్యంలో వైస్సార్ను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి పేదల పెన్నిధిని చెరగని చిరునవ్వు.. నడకలో తెలుగుదనం ఉట్టిపడే రాజసం పేదల గుండెల్లో ఎప్పటికీ చెరగని ముద్ర వేసుకున్న జ్ఞాపకం మన అభివృద్ధి ప్రదాత పేదల దేముడుగా ఆరోగ్యశ్రీ ఆయుష్ పోసాడని 108 ఆపద్బాంధవుడు అయ్యాడని ప్రజా సంక్షేమ పాలనకు సరికొత్త భాష్యం చెప్పిన వైయస్సార్ ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయి ఎనలేని సేవలను ప్రజలకు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పైలా రాధ కృష్ణ, ఈ బోనంగి పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, కార్యదర్శి బొద్దపుఅప్పారావు , మాజీ వార్డ్ మెంబర్ రమణ (ఆర్మీ) , యూత్ ప్రెసిడెంట్ మేడశేటి వాసు , రాజబాబు, సియాద్రి ఈశ్వర్, మేడశేటి దివాకర్, బొద్దపు పెద్ద అప్పల రాజు, బొద్దపు చిన్న అప్పల రాజు, రవి ,వెంకటేష్, శ్రీను, నూకలు,డి. శ్రీను, రామకుమార్,అప్పల రాజు, మండల మాజీ యూత్ అధ్యక్షులు కంచిపాటి భాస్కరరావు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరంజన్ కుటుంబానికి సోనూ సూద్ పరామర్శ

**జయభేరి, హన్మకొండ :**

ప్రాణాంతక వ్యాధితో మృతి చెందిన చిన్నారి నిరంజన్ మృతదేహాన్ని ప్రముఖ నటుడు సోనూ సూద్ వీడియో కాల్ ద్వారా చూసి నివాళి అర్పించారు. గతంలో నిరంజన్ ముంబైకి వెళ్లి సోనూ ను కలిశాడు. పవన్ కళ్యాణ్ అభిమాని అయిన నిరంజన్.. సోనూ అంటే నాకిష్టం అని చెప్పేవాడని.. గతంలో ముంబై వెళ్లి సోనూ సూద్ ను కలిశాడని చిన్నారి తండ్రి చెప్పారు. నిరంజన్ తల్లిదండ్రులతో వీడియో కాల్ లో మాట్లాడి ఓదార్చిన సోనూ సూద్.. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

- అడిషనల్ కలెక్టర్

**జయభేరి, తుర్కపల్లి, జూలై 08 :**

ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వాసాలమర్రి గ్రామంలో ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయుటలో ఉన్న సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల తరగతి గదుల నిర్మాణమును పూర్తిచేయాలని ఆదేశించారు. వాసాలమర్రి గ్రామంలో 143 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనాయని అందులో మొదలు పెట్టనివి ఇండ్లు 32 మార్కౌట్ ఇచ్చినవి 11, బిస్మిట్ కింద స్థాయి ఇండ్లు 6 బిస్మిట్ లెవెల్ 10 ,రూట్ లెవెల్ 12 , రూఫ్ కాస్టింగ్ లెవెల్ 14, పూర్తయినవి 70 ఇండ్లు అని అన్నారు. ఇల్లు కట్టుకోలేని ఆర్థిక పరిస్థితి బాగాలేని 18 ఇండ్లను నాలుగు ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఏజెన్సీలకు అప్పగించి పూర్తి చేస్తున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డిప్యూటీ ఈ ఈ శివకుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల హైస్కూల్లోని తరగతి గదుల నిర్మాణమును సానిటరీ కాంప్లెక్స్ ను పరిశీలించి త్వరితగతిన నిర్మాణాలను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరేష్, పంచాయితీ కార్యదర్శి ఇంజ నరేష్, నాయకులు దొమ్మాట బాబు ఈసీ యశోద, టీఏ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, కారోబార్ దుడుక బాబు పాల్గొన్నారు.

## గిర్మాపూర్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

- చీర్ల రమేష్ ఆధ్వర్యంలో మహానేతకు నివాళులు



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ డివిజన్ పరిధిలోని గిర్మాపూర్ గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మేడ్చల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీర్ల రమేష్ మాట్లాడుతూ రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ అమలు చేసిన ప్రజాహిత పథకాలను గుర్తు చేసుకున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేతగా ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రజానాయకుడని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొక్క రఘుపతి రెడ్డి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కె. చంద్రయ్య, బండి శ్రీనివాస్, యువ నాయకుడు కొండల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు.

## అధ్వానమైన పరిస్థితిలో లంకెలపాలెం టూ సబ్బవరం రోడ్డు

- తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న వాహనాదారులు




**జయభేరి, పరవాడ:**

సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం నుంచి పరవాడ మండలం లంకెలపాలెం వరకు గుంతలమయంతో రహదారి చాలా అధ్వానంగా మారిందని వైస్సార్సీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ నందవరపు శ్రీనివాసరావు అన్నారు.ఈ మార్గం గుండా హెవీ లోడులు తో బొగ్గు, మరియు ప్లై యాష్ లారీలు తిరగడమే దీనికి ప్రధాన కారణం అని గతంలో కంటే ఇప్పుడు ఓవర్ లోడ్లతో బొగ్గు లారీలు ఈ రహదారులు పై తిరుగుతున్నాయని దాని వలన రోడ్డులు పాడువ్వుతున్నాయని దీని పై ఎన్నిసార్లు సంబంధించిన అధికారులకు,నాయుకులకి ఫిర్యాదు చేసిన ఎటువంటి ఫలితం కనిపించడం లేదని ధూళి దుమ్ము వల్ల వ్యాపారాలు లేక దిక్కుతోచని స్థితిలో రోడ్డు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారస్తులు ఉన్నారని అన్నారు.దీనిపై స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దుష్టి పెట్టి సమస్యకు పరిస్కారం చూపే విధంగా సంబంధించిన అధికారులతో మాట్లాడాలని ఈ సందర్భంగా అయన కోరారు.

## వైఎస్సార్ కు షర్మిల నివాళులు

**జయభేరి, కడప :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత కాంగ్రెస్ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77 వ జయంతి సందర్భంగా ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్ వద్ద ఏపీసీసీ చీఫ్ షర్మిల నివాళులు అర్పించి, ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. షర్మిల మాట్లాడుతూ. కాలం మారినా తెలుగు నేలపై నాన్నది ఎప్పటికీ చెరగని సంతకం. మరణం లేని మహానాయకుడు YSR. సంక్షేమానికి, అభివృద్ధికి శాశ్వత చిరునామా YSR. రాజశేఖర్ రెడ్డిని స్మరించుకుంటున్న కోట్లాది తెలుగు ప్రజలకు రెండు చేతులు జోడించి కృతజ్ఞతలు చెప్తున్నానని అన్నారు.

# సంక్షేమ రథసారథిగా ప్రజాహృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మాజీ సీఎం వైఎస్సార్

- మండల వైస్సార్సీపీ ఆధ్వర్యంలో ఘనంగా వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల కేంద్రంలో సంత బయలువద్ద దివంగత మహానేత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మాజీ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77 వ జయంతి సందర్భంగా అయిన సేవలను, ప్రజా సంక్షేమ ఆశయాలను స్మరించుకుంటూ సంతబయులు వద్ద ఆయన కాంస్య విగ్రహానికి వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావు, పరవాడ జడ్పీటీసీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. రాజు,వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి చుక్కా రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులతో కలిసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ వై.యస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించి, పేదలు, రైతులు, బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ఆయన చూపిన సంక్షేమ మార్గాన్ని, ప్రజా సేవా స్ఫూర్తిని వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముందుకు తీసుకెళ్తూ, వైయస్ఆర్ ఆశయాలను కొనసాగిస్తూ మరింత పార్టీని బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. పరవాడ మండల వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు,నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, వార్డు అధ్యక్షులు అప్పికొండ మహాలక్ష్మి నాయుడు తాజా మాజీ సర్పంచ్ లు వెన్నల అప్పారావు గొర్లి గోపి ఎంపీటీసీ లు చప్పా ప్రభాసన్యాసిరావు, గెడ్డం పుష్పా చంద్రరావు, మాజీ పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి కావలివాసు, జిల్లా ప్రచార విభాగ కార్యదర్శి పల్లా గోవింద్, పార్టీ మండల ఉపాధ్యక్షులు బొబ్బిలి సత్తిబాబు, మండల ప్రధాన కార్యదర్శి పైల రాధా కృష్ణ, మండలకార్యదర్సు లు తిక్కాడ సత్యన్నారాయణ, బత్తి అప్పారావు, యలమర్తి వెంకటరావు,వెన్నల సింహాద్రి, మడక సూరిబాబు, పైల అప్పారావు, పైల హరీష్, పైల పైడం నాయుడు, మాసవరపు అప్పారావు, బిసి సెల్ అడ్డూరి శ్రీను వాస్, సోషల్ మీడియా అధ్యక్షురాలు దివ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈతలపాక సన్యాసిరావు, బొండా సతీష్, బొద్దపు వెంకటరమణ, శ్రీను, తోట పవన్,కడవల రాజు, శీలం సూరిబాబు, పైల అప్పారావు, పోలిరెడ్డి వెంకటరావు,సూరాడతాతారావు, బొండాసతీష్‌బోండా కేశవ, పార్టీ కార్యకర్తలు వైయస్సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వాలు మారినా మారని ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడి

- కందుకూరి నరేష్, టీ ఎన్ ఎస్ ఎఫ్ పరకాల నియోజకవర్గం బాధ్యులు

**జయభేరి, పరకాల, జులై 08 :**

ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులు మారుతున్నారు. కానీ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల ఫీజుల దోపిడి మాత్రం ఏమాత్రం మారడం లేదని, విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని లెక్కచేయకుండా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ప్రవేశాల సీజన్ వచ్చిందంటే చాలు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటాయి. క్యాంపస్‌కు వచ్చిన వెంటనే ఏసీ గదుల్లో కూర్చోబెట్టి, టీ, కూల్‌డ్రింక్స్, అల్పాహారం, భోజనం వంటి మర్యాదలతో ఆహ్వానించి, తమ సంస్థ గొప్పదని నమ్మించే ప్రయత్నం చేస్తారు. అనంతరం పిల్లలను హాస్టల్‌లో చేర్పించే వరకు వివిధ హామీలు ఇస్తూ, భారీ ఫీజులు చెల్లించేలా ఒప్పిస్తుంటారు. చేరిన తర్వాత మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోతుంది అని అన్నారు. అదనపు ఫీజులు, హాస్టల్ ఛార్జీలు, పుస్తకాలు, యూనిఫాంలు, ప్రత్యేక కోచింగ్ పేర్లతో తల్లిదండ్రులపై మరింత ఆర్థిక భారం మోపుతున్నారన్నారు.విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెంచుతూ, వారి మానసిక ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తున్నారు. విద్య హక్కు కావాలి గానీ, వ్యాపారం కాకూడదని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులపై ప్రభుత్వం కఠినమైన నియంత్రణ తీసుకురావాలి అని అన్నారు. ప్రతి విద్యాసంస్థ ఫీజు వివరాలను పారదర్శకంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలి అని అన్నారు. తల్లిదండ్రులను మోసం చేసే తప్పుడు ప్రచారాలపై కూడా కఠిన చర్యలు అవసరం అని అన్నారు. "విద్యార్థుల భవిష్యత్తు పేరుతో తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేసే ఫీజుల దోపిడీకి ఇక అడ్డుకట్ట వేసే సమయం ఆసన్నమైంది అని అన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

**జయభేరి, ములుగు :**

ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు నెలవారి తనిఖీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు.గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.

## రైతులకు ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యంపై శాశ్వత పరిష్కారం చూపండి

- జిల్లా టిడిపి సాంస్కృతి విభాగ అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు డిమాండ్


**జయభేరి, పరవాడ:**




అనకాపల్లి జిల్లా జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీ పరిశ్రమల కాలుష్య కోరల్లో పరవాడ గ్రామం చిక్కుకొని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని జిల్లా టిడిపి సాంస్కృతి విభాగ అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పరవాడలో గాలి నీరు నేల కలుషితమై సుమారు 200 ఎకరాల విస్తీర్ణం గల పంట భూమి నాశనం అయిపోయిందని, ఈ భూమికి పెద్ద చెరువు ఆధారంగా ప్రతి సంవత్సరం రైతులు రెండు పంటలు పండించేవారు కానీ నేడు చెరువుల్లో ఫార్మా వ్యర్థ జలాలు కలవటం వలన పంటలన్నీ నాశనం అయిపోతున్నాయని, అలాగే చెరువులో నీరు పశువులు తాగి పశు సంపద నాశనం అవుతుందని, ప్రతి సంవత్సరం పెద్ద చెరువులో ఆయకట్టుదారులు కొంత మొత్తానికి పాట పాడుకొని చేపల పెంచుకునే వారు చేపలు కూడా ఫార్మా వ్యర్థ జలాల వలన పూర్తిగా చనిపోయి రైతు నష్టపోవడంతో పెద్ద చెరువు రైతు పరిస్థితి అయోమయంలో పడిందని అన్నారు. 2019లో సుమారు నెలరోజుల పాటు ఫార్మా కాలుష్యంపై పెద్ద చెరువు రైతులు, గ్రామ పెద్దలు ధర్నాలు, పోరాటాలు చేశారని, ఫార్మా పరిశ్రమ యాజమాన్యులు హడావుడిగా పెద్ద చెరువు పరిశీలించి చేతులు దులుపుకొని వెళ్లిపోయారని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు వచ్చి చెరువు నీటిని పరిశీలించి ఫార్మా యాజమాన్యానికి అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చారని, అప్పటి ప్రజా ప్రతినిధులు వీటికి శాశ్వత పరిష్కారం చూపుతామని ఆ ధర్నాలో రైతులకు హామీ ఇచ్చి ధర్నాను నిలుపుదల చేశారని అన్నారు. ఇప్పటికీ పరవాడ పెద్ద చెరువు రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించలేదని అన్నారు. వీటిపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు , పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ఫార్మా యాజమాన్యంతో చర్చించి పరవాడ పెద్ద చెరువు రైతులకు ఫార్మా వ్యర్థ జలాల నుండి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి గండి శ్రీనివాసరావు, రైతు చీపురుపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం

**జయభేరి, శేరిలింగంపల్లి :**



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు చేపడుతున్న వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వెళ్లే రోడ్డు వయా ఎల్లమ్మబండ రోడ్డు నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందని అన్నారు.

100 ఫీట్ రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యల పై గతంలోనే శేరిలింగంపల్లి శాసనసభ్యులు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, వివిధ శాఖల అధికారులతో చర్చించి, ప్రణాళికలు రూపొందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా రోడ్డు మధ్యలో వచ్చిన బండ రాళ్ళ ను తొలగించడం, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, రోడ్డు పక్కన గల విద్యుత్ స్థంబాలను స్థాన భ్రంశం చేపట్టడం, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచడం జరిగిందని అన్నారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులకు తెలియచేశారు. రోడ్డు విస్తరణ పనులు పనులు పూర్తయితే ఆల్విన్ కాలనీ, శంషిగూడ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తొలగి, ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, జిల్లా గణేష్, ఇస్మాయిల్, షౌకత్ ఆలీ మున్నా, మల్లేష్, నాగేష్ గౌడ్, రవీందర్, ఖలీమ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మిక పర్యటన

- బుద్ధ నగర్ లో పర్యటించిన డిప్యూటీ కమిషనర్ శైలజ, మాజీ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి
- పరిశుభ్రత, పచ్చదనం, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

**జయభేరి, మేడిపల్లి :**




మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పీర్జాదిగూడ పరిధిలోని బుద్ధ నగర్ కాలనీలో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ ఆకస్మిక పర్యటన చేశారు. కాలనీలో జరుగుతున్న పారిశుధ్యం, మొక్కల పెంపకం, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్ల నిర్వహణ, తదితర అంశాలపై పర్యవేక్షించారు. సంబంధిత అధికారులు, ప్రజలతో పలు సమస్యలను తెలుసుకుని సూచనలు, సలహాలు చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, పచ్చదనం పరిశుభ్రంపై , ప్రజల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, జంగారెడ్డి, ఇంద్రారెడ్డి, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.





## 10న జరిగే బందును విజయవంతం చేయండి

- ఎస్ఎఫ్ఐ

**జయభేరి, పరకాల, జులై 08 :**

బుధవారం ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలో బందు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల సమస్యలు పరిష్కరించాలని అదేవిధంగా ప్రభుత్వ బడులను మూసివేత ఆపాలని ఎం ఈ ఓ పోస్టులను భర్తీ చేయాలని అద్దె భవనంలో నడుస్తున్న గురుకులాలకు సొంత భవనం నిర్మించాలని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లను విడుదల చేయాలని ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటివరకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు రాలేదని అన్నారు. పరకాల పట్టణంలో బందు కు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటు కోల్పోకుండా చూడాలి



**జయభేరి, సైదాపూర్ :**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్ రాచంద్రపూర్ (కుర్మపల్లి) గ్రామంలో జరుగుతున్న SIR ప్రక్రియను పర్యవేక్షించడం జరిగింది. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఒక్క ఓటు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత BLO, BLAల దని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ఇంచార్జ్ గుళ్ల రఘు, BLA గుళ్ల రమేష్, కాంగ్రెస్ నాయకులు గుళ్ల సురేందర్, గుంటి సమ్మయ్య, ఎగడి వెంకటస్వామి, గొట్టె కొమురయ్య, సమ్మ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## డీసీ కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం

- హృదయపూర్వక ధన్యవాదాలు




**జయభేరి, కాప్రా :**

డీసీ కాలనీ వాసులందరి తరపున మన ప్రియతమ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చెర్లపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ లకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న డీసీ కాలనీ రోడ్డు పనులు మీ విలువైన సహకారం, చొరవ మరియు ప్రత్యేక శ్రద్ధతో ప్రారంభం కావడం కాలనీ వాసులందరికీ ఎంతో ఆనందకరమైన విషయం. మా సమస్యలను అర్థం చేసుకుని, అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్లేందుకు మీరు అందించిన సహకారం మరువలేనిది. ఇదే విధంగా మీ విలువైన జోక్యం, సహకారంతో త్వరలోనే కాలనీ అంతర్గత డ్రైనేజీ పనులు, పార్క్ అభివృద్ధి పనులు కూడా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని వినమ్రంగా కోరుకుంటున్నాము. డీసీ కాలనీ అభివృద్ధికి మీరు అందిస్తున్న సహకారం, ప్రోత్సాహానికి మరోసారి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, మీకు ఎల్లప్పుడూ మా సంపూర్ణ సహకారం ఉంటుందని తెలియజేస్తున్నాము.

## కొన్ని ఏండ్లుగా డ్రైనేజి సమస్యతో ఇబ్బందులు



**జయభేరి, ఉప్పల్ :**

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియ టౌన్షిప్ లో కోటి అరవై లక్షల రూపాయల నిధులతో బాక్స్ డ్రైన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మరియు మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి. ఎమ్మెల్యే మాట్లాడుతూ..కొన్ని ఏండ్లుగా డ్రైనేజి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనప్రియ టౌన్షిప్ వాసులకు, పరిసర కాలనీ వాసులకు ఈ బాక్స్ డ్రైన్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనప్రియ టౌన్షిప్ కాలనీ వాసులు, BRS పార్టీ స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కు రూ.45 లక్షలు మంజూరు

- కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన కోలన్ హన్మంత్ రెడ్డి

**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

సాయి నగర్, బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో బాల బ్రహ్మాచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి కృషితో ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ కమిటీ స్థలంలో శ్రీ కోలన్ హన్మంత్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ నివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బెంగలూరు తరహాలో కోకాపేట నిర్మాణాలు



**జయభేరి, హైదరాబాద్, జూలై 8 :**

పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ, కమర్షియల్ హబ్ శరవేగంగా విస్తరిస్తోంది. అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెన్సీ నివేదికలు వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం.. కోకాపేట నియోపోలిస్ ఫేజ్ 2 లేఅవుట్లలో వాణిజ్య స్థలాల ధరలు చదరపు గజానికి ఎన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డు స్థాయి మార్కును తాకాయి. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు లభిస్తున్న అనుమతులే ఇక్కడి భూములకు రెక్కలు రావడానికి ప్రధాన కారణం.ఒకప్పుడు బెంగళూరులోని ఎంజీ రోడ్ లేదా చెన్నైలోని ఓఎమ్ఆర్ ప్రాంతాలు దక్షిణాదిలోనే అత్యంత ఖరీదైన కమర్షియల్ స్థలాలుగా ఉండేవి. అయితే, గడిచిన కొద్దికాలంగా కోకాపేట పరిసర ప్రాంతాల్లో జరిగిన ప్రభుత్వ భూముల వేలంపాటలు , తాజా ప్రైవేట్ మార్కెట్ విశ్లేషణల ప్రకారం.. వాటన్నింటినీ వెనక్కి నెట్టి దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఖరీదైన , అత్యున్నత స్థాయి వాణిజ్య హబ్‌గా కోకాపేట నియోపోలిస్ అవతరించింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , అంతర్జాతీయ టెక్ దిగ్గజాలు ఇక్కడ తమ కార్యాలయాలను స్థాపించేందుకు పోటీ పడుతుండటంతో ల్యాండ్ వాల్యూస్ భారీగా పెరిగాయి.నియోపోలిస్ లేఅవుట్ ప్రత్యేకత ఏమిటంటే.. ఇక్కడ ఎలాంటి ఎత్తు పరిమితులు లేకుండా వందలాది అంతస్తులతో స్కై స్క్రాపర్ భవనాలను నిర్మించుకునే వెసులుబాటు ఉంది. దీనికి తోడు 100 నుండి 150 అడుగుల వెడల్పు గల ట్రంక్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ , పవర్‌లైన్ నెట్‌వర్క్, ఔటర్ రింగ్ రోడ్డుకు నేరుగా ఉన్న కనెక్టివిటీ వంటి మల్టీబిలియన్ డాలర్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇక్కడి భూములకు తిరుగులేని డిమాండ్‌ను తెచ్చిపెట్టాయి. ఈ వారం నమోదైన రికార్డు ధరలు పశ్చిమ హైదరాబాద్ శివార్ల రియల్ ఎస్టేట్ సామర్థ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్ కు చాటిచెప్పాయి.ఈ స్థాయి రేట్లు కేవలం కమర్షియల్ ల్యాండ్స్ కే పరిమితం కాకుండా.. పరిసరాల్లోని నార్సింగి, గండిపేట, పుప్పాలగూడ వంటి మైక్రోమార్కెట్లలోని రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లు, లగ్జరీ విల్లాల ధరలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు ఇన్వెస్టర్లకు ఇది భారీ లాభాలను తెచ్చిపెడుతున్నా.. సాధారణ, మధ్యతరగతి కొనుగోలుదారులకు పశ్చిమ హైదరాబాద్ ప్రాపర్టీలు మరింత భారంగా మారనున్నాయి.

## విశాఖ ఫిషింగ్ హార్బర్ లో తీవ్ర ఉద్రిక్తత

**జయభేరి, విశాఖపట్నం :**

బుదవారం విశాఖ ఫిషింగ్ హార్బర్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కూటమి ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదని చేస్తున్న మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేసారు. ఆరుగురు మత్స్యకారులు గల్లంతయితే ప్రభుత్వం స్పందించే తీరు ఇదేనా అంటూ మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం న్యాయం చెయ్యకపోవడం దారుణమని ఆరోపించారు. అక్కడికి వచ్చిన మంత్రి కొల్లు రవీంద్రను అడ్డుకున్నారు. మహిళలు మంత్రి కాన్వాయ్ను అడ్డుకున్నా. మంత్రి ఆగకుండా వెళ్లిపోయారు. పోలీసులు బాధిత మహిళలను లాగిపడేసారు. విశాఖ మత్స్యకారుల ఆచూకీపై చేతులెత్తేసింది. గల్లంతైన మత్స్యకారులు ట్రేస్ కాలేదు.. మత్స్యకారులు ఇక లేరని నిర్ధారించామన్న మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పెద్దపీట

- ఉచిత పత్తి విత్తనాల పంపిణీకి శ్రీకారం
- మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్
- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**జయభేరి, గజ్వేల్ /వర్గల్, జులై 08 :**



రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఏడీఏ అనిల్ కుమార్ స్పష్టం చేశారు. మిషన్ పర్ కాటన్ ప్రొడక్టివిటీ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం తునికిఖల్సాలో వంద శాతం సబ్సిడీపై పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ప్రతి రైతుకు రూ 2 లక్షల పంట రుణమాఫీ చేయగా, ప్రతి ఎకరాకు రైతు భరోసా కింద రూ 12వేలు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేగాకుండా పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వ కొనుగోలు చేస్తుండగా, సన్నధాన్యానికి రూ 500 బోనస్ అందిస్తున్న ఘనత దక్కించుకున్నట్లు తెలిపారు.

కాగా అనుకూలమైన పంట పొలాల్లో దగ్గరి అంతరం ద్వారా పత్తి పంట సాగు చేసి అధిక ప్రయోజనం పొందాలని సూచించారు. అలాగే నాణ్యమైన విత్తనాలను సాగుచేసి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందాలని కోరారు. సిపిఎస్ పథకం క్రింద వర్గల్ మండలానికి 250 ఎకరాలకు 1000 పత్తి విత్తన ప్యాకెట్లు రాగా, రైతులకు అందజేస్తామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పత్తి పంట సాగులో సమతుల్య ఎరువుల నిర్వహణ, కలుపు యజమాన్య పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు గణేష్, చెన్నయ్య, మాజీ ఎంపీపీలు నిమ్మ రంగారెడ్డి, మోహన్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు కడపల నర్సింహ రెడ్డి, ఆత్మ కమిటీ సభ్యులు రంగ మహేందర్ గౌడ్, లింగ పద్మ, షరీఫ్, రెహమాన్, ఏఈఓలు సునీత, అనిత, భారతి, వినీత, మౌనిక, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అశోక్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ బాధ్యులు సాయి గౌడ్, కాంగ్రెస్ నాయకులు నీల శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, బాబా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## పీవీ విద్యానికేతన్‌లో ఘనంగా వనమహోత్సవం

- పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ప్రతిజ్ఞ
- ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలి: ఎంఈఓ శంకరయ్య

**జయభేరి, మేడ్చల్ :**




మేడ్చల్ పట్టణంలోని పాపారాయ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఏబీపీ హర్షిత్ బృందం ఉపాధ్యాయుల నేతృత్వంలో పట్టణ ప్రధాన వీధుల గుండా అవగాహన ర్యాలీ చేపట్టి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. "మొక్కలు నాటండి-ప్రకృతిని కాపాడండి", "చెట్లను పెంచుదాం-భవిష్యత్తును రక్షిద్దాం" వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం మండల విద్యాధికారి కార్యాలయ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి శంకరయ్య విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని పెద్ద చెట్టుగా తీర్చిదిద్దాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్ల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతిపై ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందించడమే వనమహోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ నరసింహులు మాట్లాడుతూ, "వృక్షో రక్షతి రక్షితః" అనే సూక్తిని గుర్తుచేస్తూ, మనం చెట్లను కాపాడితే అవే మనల్ని కాపాడతాయని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి పరిరక్షణ అత్యవసరమైందని, చెట్ల నరికివేతను అరికట్టి ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, భూపాల్ రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి అనిత ప్రియ, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, సుధారాణి, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 48% లాభం పేరిట 6 వేల మందికి కుచ్చుటోపీ

- బాధితుల్లో తెలుగు రాష్ట్రాల వారు 1,500 మంది
- షేర్స్ బజార్, కిసాన్ పరివార్ సంస్థల ఎండీ అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్ :**



'రూ. లక్ష పెట్టుబడి పెట్టండి.. ఏడాదికి 48% లాభం చెల్లిస్తాం' అంటూ దేశవ్యాప్తంగా ఆరు వేల మందిని ముంచిన షేర్స్ బజార్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్బీపీఎల్), కిసాన్ పరివార్ లిమిటెడ్ (కేపీఎల్) సంస్థల వ్యవస్థాపకుడు, ఎండీ నేనావత్ భూపాలానాయక్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు ఈ రెండు కంపెనీల పేరుతో దేశవ్యాప్తంగా రూ. వందల కోట్లు వసూలు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. బాధితుల్లో తెలుగు రాష్ట్రాల వారు 1500 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. భూపాల్నాయక్ కు ఇటీవల గుజరాత్ పోలీసులు అరెస్టు చేయగా... సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు శుక్రవారం రాత్రి పీటీ వారెంటుపై హైదరాబాద్ కు తీసుకొచ్చారు. మహబూబాబాద్ జిల్లా కురవి కందికొండకు చెందిన భూపాల్ నాయక్... కూకట్ పల్లి, కొండాపూర్ లో 2020లో ఎస్బీపీఎల్, కేపీఎల్ సంస్థలను ప్రారంభించాడు. ఎస్బీపీల్... స్టాక్ ట్రేడింగ్ చేస్తోందని, కేపీఎల్.. రైతుల నుంచి భూములను సమీకరించి ప్రకృతి వ్యవసాయం చేస్తోందని ప్రచారం చేశాడు. ప్లాన్‌ఏ కింద పెట్టుబడికి 18%, ప్లాన్‌బి కింద 30%, ప్లాన్‌సీ కింద 48% చొప్పున వార్షిక లాభం ఇస్తామని చెప్పేవాడు. రూ.12.5 లక్షల పెట్టుబడి పెడితే.. 5 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసి.. 24% లాభం ఇస్తామన్నాడు. అతన్ని నమ్మిన వందల మంది రూ. కోట్లలో డబ్బు బదిలీ చేశారు. మొదట్లో లాభాలు పంచినా గతేడాది సెప్టెంబరు నుంచి మాయమయ్యాడు. మోకిలకు చెందిన నేవీ విశ్రాంత అధికారి సంజీవ్ గుప్త, మరో 10 మంది.. ఈ రెండు సంస్థల్లో రూ.4.51 కోట్ల పెట్టుబడి పెట్టారు. బాధితుల ఫిర్యాదుతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీస్ స్టేషన్లో జూన్ 15న కేసు నమోదైంది.

### గుజరాత్ లోను కేసులు:

భూపాల్ నాయక్ గుజరాత్లో లోనూ కేసు నమోదైంది. అక్కడి పోలీసులు భూపాలు శంషాబాద్ విమానాశ్రయంలో 10 రోజుల క్రితం అరెస్టు చేసి గుజరాత్ తీసుకెళ్లారు. సైబరాబాద్ పోలీసులు పీటీ వారెంట్పై నగరానికి తీసుకొచ్చారు. ఈ మోసంలో నిందితుడికి.. పలువురు సహకరించినట్లు బాధితులు పేర్కొంటున్నారు. భూపాల్ నాయక్ 2023 శాసనసభ ఎన్నికల్లో డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశాడు. మండలస్థాయి ఏజెంట్లకు బైక్లు పంపిణీ చేశాడు. బోర్ల తవ్వకాలు, విద్యార్థులకు బస్ పాసుల పంపిణీ తదితర ప్రచారంతో ఊదరగొట్టాడు.

## భారీగా పెరగనున్న ఆస్తి పన్ను

**జయభేరి, హైదరాబాద్, జూలై 8 :**

హైదరాబాద్ మహానగర మున్సిపల్ పరిపాలనా వ్యవస్థలో గత ఏడు దశాబ్దాలలోనే ఎన్నడూ లేనంతటి అతిపెద్ద సంస్కరణకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1955 నాటి పాత జీహెచ్ఎంసీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తూ.. మారుతున్న కాలం, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా సరికొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా ది డ్రాఫ్ట్ కోర్ అర్బన్ రీజియన్ బిల్, 2026 ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. క్యూర్ బిల్లుగా పిలుస్తున్న ఈ మార్పును హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పౌర సేవలను మరింత వేగవంతం చేయడానికి, పరిపాలనను ఆధునీకరించడానికి ఈ చారిత్రాత్మక బిల్లును రూపకల్పన చేసినట్లుగా చెబుతున్నారు.హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ , సైబరాబాద్ , మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఒకే సమగ్ర పరిపాలనా చట్టం కిందికి తీసుకురావడం. ప్రస్తుతం నగరంలో అర్బన్ ప్లానింగ్, రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రవాణా, ప్రజారోగ్యం, విపత్తు నిర్వహణ వంటి సేవలను వేర్వేరు విభాగాలు చూస్తుండటంతో సమన్వయ లోపం ఏర్పడుతోంది. ఈ కొత్త చట్టం ద్వారా ఈ విభాగాలన్నింటినీ అనుసంధానించనున్నారు. తద్వారా ప్రాజెక్టుల అమలు వేగవంతం కావడమే కాకుండా పౌరులకు నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం అమల్లో ఉన్న యాన్యువల్ రెంటల్ వాల్యూ ఆధారిత ఆస్తి పన్ను విధానానికి ఈ బిల్లు స్వస్తి పలకనుంది. దీని స్థానంలో మార్కెట్ రేట్లకు అనుగుణంగా ఉండే క్యాపిటల్ వాల్యూ ఆధారిత సరికొత్త ఆస్తి పన్ను అసెస్‌మెంట్ నమూనాను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఒక స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. వీటితో పాటు జీఐఎస్ ఆధారిత అర్బన్ ప్లానింగ్, భూగర్భ యుటిలిటీల సమగ్ర నిర్వహణ, ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పౌర సేవలు, సులభతర వాణిజ్యం లో భాగంగా సింగిల్ ట్రేడ్ లైసెన్స్ విధానం, సరళీకృత భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ వంటి కీలక సంస్కరణలను ఇందులో పొందుపరిచారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే భవనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సకాలంలో పన్నులు చెల్లించే వారికి రిబేటులు కూడా ఇవ్వనున్నారు.ఈ డ్రాఫ్ట్ CURE బిల్ 2026 ను ప్రజల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు.



## అప్పులు భారం భరించలేక ఆత్మహత్య చేసుకొన్నా మెకానిక్ సురేష్

**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. అప్పుల వలన మనస్థాపం చెంది ఓ ద్విచక్ర వాహన మెకానిక్ పురుగుల మందు సేవించి మృతి చెందిన ఘటన చోటు చేసుకొంది.పరవాడ పోలీస్ శాఖ చెప్పిన వివరాలు ప్రకారం మృతుడు రాజాన సురేష్ (39) నూకరాజు కుమారుడు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, పరవాడ నివాసి పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా రాజశేఖర్ బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు.బుధవారం మధ్యాహ్నం అప్పుల భారం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని తన సోదరి దేవికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. వెంటనే ఆమె తన భర్తతో కలిసి మెకానిక్ షాప్‌కు వెళ్లగా సురేష్ నాగం అనే పురుగుల మందు సేవించినట్లు గుర్తించారు. వెంటనే ఆయనను ఎన్‌టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి, అనకాపల్లికి తరలించగా, చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి సోదరుడు రాజాన గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేయగా దీనిపై ఎస్ఐ బి కృష్ణారావు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నంకీన్ కన్వెన్షన్

**జయభేరి, హైదరాబాద్ :**

దేశంలోని రూ.1.5 లక్షల కోట్ల విలువైన మిఠాయి నంకీన్ పరిశ్రమకు చెందిన అతిపెద్ద వ్యాపారాల్లో ఒక్కటైన వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్ (డబ్ల్యూఎంఎన్సీ) పర్చేజింగ్ ను ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో జరగనుంది. ఈ కన్వెన్షన్కు సంబంధించిన పోస్టర్ ను బంజారాహిల్స్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మ్యానఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ దీనిని ఆవిష్కరించి మాట్లాడారు. పండుగల సీజన్ కు ముందు దేశవ్యాప్తంగా తయారీదారులు, సరఫరాదారులు, రిటైలర్లను ఒకే వేదిక పైకి తీసుకురావడమే ఈ కన్వెన్షన్ లక్ష్యమని తెలిపారు. 'పర్ఫెక్ట్ స్టార్ట్ టుది ఫెస్టివ్ సీజన్' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ కన్వెన్షన్లో దేశవ్యాప్తంగా మిఠాయి, నంకీన్, బేకరీ, స్నాక్స్ రంగాలకు చెందిన తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, టెక్నాలజీ సంస్థలు, రిటైలర్లు పాల్గొననున్నట్లు వివరించారు. దేశంలోని రూ.1.5 లక్షల కోట్ల విలువైన మిఠాయి నంకీన్ పరిశ్రమకు చెందిన అతిపెద్ద వ్యాపారాల్లో ఒక్కటైన వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్ (డబ్ల్యూఎంఎన్సీ) పర్చేజింగ్ ను ఈ నెల 16 నుంచి 18 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో జరగనుంది. ఈ కన్వెన్షన్కు సంబంధించిన పోస్టర్ ను బంజారాహిల్స్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మ్యానఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ దీనిని ఆవిష్కరించి మాట్లాడారు. పండుగల సీజన్ కు ముందు దేశవ్యాప్తంగా తయారీదారులు, సరఫరాదారులు, రిటైలర్లను ఒకే వేదిక పైకి తీసుకురావడమే ఈ కన్వెన్షన్ లక్ష్యమని తెలిపారు. 'పర్ఫెక్ట్ స్టార్ట్ టుది ఫెస్టివ్ సీజన్' అనే పేరుతో నిర్వహిస్తున్న ఈ కన్వెన్షన్లో దేశవ్యాప్తంగా మిఠాయి, నంకీన్, బేకరీ, స్నాక్స్ రంగాలకు చెందిన తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, టెక్నాలజీ సంస్థలు, రిటైలర్లు పాల్గొననున్నట్లు వివరించారు.



# వేరొకరి ఇయర్ బడ్స్ వాడుతున్నారా.?

**ఇది తెలిస్తే ఇంకోసారి ఆ జోలికి వెళ్లరు..**

నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరి వద్ద బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ కచ్చితంగా ఉంటున్నాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్నప్పుడైనా పాటలు వినడానికి లేదా ఫోన్ మాట్లాడటానికి ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉపయోగపడతాయి. అయితే, చాలామంది తమ ఇయర్ బడ్స్ అందుబాటులో లేనప్పుడు లేదా స్నేహితులు పంపిన ఏదైనా ఆడియో వినడానికి వారి ఇయర్ బడ్స్‌ను మార్చుకుని వాడుతుంటారు. ఇలా ఇతరుల బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ వాడటం అనేది అత్యంత ప్రమాదకరమని, ఇది నేరుగా చెవి ఇన్ఫెక్షన్లను కొనితెచ్చుకోవడమేనని వైద్యులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒకరి ఇయర్ బడ్స్‌ను మరొకరు పంచుకోవడం అనేది తీవ్రమైన అపరిశుభ్రమైన అలవాటు. ఇది ఎంత అసహ్యకరమైన అలవాటంటే, వేరొకరు వేసుకుని చెమట పట్టిన సాక్సులను మనం వేసుకోవడం కంటే కూడా ఘోరమైనదని వైద్యులు పోల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతి ఒక్కరి చెవి లోపలి భాగంలో కొంత శాతం సహజమైన బ్యాక్టీరియా, వ్యాక్స్, ఫంగస్ ఉంటాయి. ఇవి ఆయా వ్యక్తుల శరీర తత్వానికి అనుగుణంగా ఉంటాయి. అయితే, మనం ఇతరుల ఇయర్ బడ్స్‌ను మన చెవిలో పెట్టుకున్నప్పుడు, వారి చెవిలో ఉండే ఆ ప్రమాదకరమైన బ్యాక్టీరియా, ఫంగస్ కణాలు ఆ ఇయర్ బడ్స్ ద్వారా నేరుగా మన చెవిలోకి ప్రవేశిస్తాయి.

ఇలా ఇతరుల బ్యాక్టీరియా మన చెవిలో చేరడం వల్ల చెవి లోపలి భాగంలో తీవ్రమైన అలర్జీలు, ఇన్ఫెక్షన్లు దారితీస్తాయి. దీనివల్ల చెవిలో భరించలేనంత తీవ్రమైన దురద, విపరీతమైన నొప్పి, చెవిలో నుంచి పసుపు రంగు ద్రవాలు కారడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. సమస్య మరింత తీవ్రమైతే అది వినికిడి లోపానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. అందుకే పర్సనల్ హైజీన్లో భాగంగా ఇయర్ బడ్స్ అనేవి కేవలం మీ వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితం కావాలి. 'మీ ఇయర్ బడ్స్‌ను ఎవరికీ ఇవ్వకండి, ఇతరులవి మీరు అస్సలు వాడకండి' అని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వేరొకరిది వాడాల్సి వచ్చినా లేదా మీ ఇయర్ బడ్స్‌ని ఇతరులు వాడినా.. వాటిని తిరిగి ఉపయోగించే ముందు శానిటైజర్ లిక్విడ్ లేదా ఆల్కహాల్ వైప్స్‌తో పూర్తిగా క్లీన్ చేసిన తర్వాతే వాడటం సురక్షితం.



# నిద్రలేచిన తర్వాత ఎలా గడపాలో తెలుసా?

**హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌కు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ ఏం చెబుతున్నారంటే.. ఉదయం వేళల్లో కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా శరీరంలోని సిర్కాడియన్ రిథమ్‌ను సమతుల్యం చేసుకోవచ్చు. దీంతో శరీరం సహజమైన శక్తిని పొందడమే కాకుండా, మెరుగైన నిద్ర కూడా లభిస్తుంది.**

ఉదయాన్నే సూర్యరశ్మిని ఆస్వాదించండి

నిద్రలేచిన 30 నుంచి 60 నిమిషాలలోపు కనీసం 10 నుంచి 20 నిమిషాల పాటు సహజ సూర్య కాంతిలో గడపాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరంలో కార్టిసాల్ హార్మోన్ సమతుల్యంగా విడుదల కావడానికి సహాయపడుతుంది. ఫలితంగా రోజంతా ఉత్సాహంగా, చురుకుగా ఉండగలుగుతారు.

**నిద్రలేవగానే కాఫీకి దూరంగా ఉండండి**

చాలామంది నిద్రలేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు కలిగి ఉంటారు. అయితే శరీరం సహజంగా మేల్కొనే ప్రక్రియకు సమయం ఇవ్వడం అవసరం. అందుకే కనీసం 60 నుంచి 90 నిమిషాల తర్వాత కాఫీ లేదా టీ తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందుగా నీళ్లు తాగండి**

రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరంలో కొంత మేర నీటి లోపం ఏర్పడుతుంది. అందువల్ల ఉదయం లేవగానే సుమారు 500 మిల్లీలీటర్ల నీరు తాగడం ద్వారా శరీరానికి తేమను అందించవచ్చు. ఇది జీవక్రియలను చురుకుగా చేయడంలో కూడా సహాయపడుతుంది.

**తేలికపాటి వ్యాయామం చేయండి**

ఉదయం కొద్దిసేపు నడవడం, ఒళ్ళు విరుచుకోవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం ద్వారా శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. ఇది మెదడుకు రోజు ప్రారంభమైందనే సంకేతాన్ని పంపి ఏకాగ్రత, శక్తిని పెంచుతుంది. నిద్రలేవగానే సోషల్ మీడియా, మెసేజ్‌లు లేదా ఈమెయిల్స్ చూడడం వల్ల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఉదయం మొదటి గంటలో మొబైల్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం మంచిది.

**స్నూజ్ బటన్ నొక్కకండి**

అలారం మోగిన ప్రతిసారి స్నూజ్ బటన్ నొక్కడం వల్ల మెదడు మళ్లీ నిద్రలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది. దీంతో అలసట, నీరసం పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అలారం మోగగానే లేవడం ఉత్తమం.

**పోషకాలు ఉన్న అల్పాహారం తీసుకోండి**

ఉదయం అల్పాహారం రోజంతా శక్తిని అందించే ముఖ్యమైన భోజనం. అధిక చక్కెర కలిగిన ఆహారాలకు బదులుగా ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది.

**ఆరోగ్యకరమైన ఉదయమే ఆరోగ్యకరమైన రోజుకు పునాది**

ఉదయం వేళల్లో ఈ సాధారణ అలవాట్లను పాటించడం ద్వారా శరీర ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, మంచి నిద్ర కూడా పొందవచ్చు. చిన్న మార్పులతో పెద్ద ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రోజును ఆరోగ్యకరమైన ఉదయంతో ప్రారంభించడం అవసరం.



# ఫుల్ ప్రోటీన్ తో అందరికి నచ్చే ఎనర్జీ డ్రింక్..

**రోజూ ఉదయాన్నే తీసుకున్నారంటే తిరుగులేని ఆరోగ్యం మీ సొంతం!**

ఇటీవలి కాలంలో మఖానా ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు, వాటిని ఎలా తీసుకోవాలో ఇప్పుడు తప్పక తెలుసుకోవాలి.

నేటి కాలంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి రకరకాల ఆహారాలు తింటారు. కొందరు తమ ఆహారంలో మఖానాను కూడా చేర్చుకుంటారు. ఇటీవలి కాలంలో మఖానా..తామర గింజలు లేదా ఫాక్స్ నట్స్ అనేది ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. ఆరోగ్యానికి పోషకమైన మఖానా, సహజంగా శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. అందుకే మఖానాను పోషకాల గనిగా పరిగణిస్తారు. మఖానా తినడం వల్ల బలహీనమైన ఎముకలకు శక్తి లభిస్తుంది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

**ఎముకలు, కండరాల బలం:**

మఖానా, పాలు రెండింటిలోనూ కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను, పళ్ళను దృఢంగా ఉంచడమే కాకుండా ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే, ఇందులోని హైప్రోటీన్ కండరాల పెరుగుదలకు, కణజాలాల మరమ్మత్తుకు ఎంతగానో తోడ్పడుతుంది.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:**

మఖానాలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి పాలలోని అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో కలిసి శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీనివల్ల సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం సురక్షితంగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి మేలు:**

మఖానాలో కొలెస్ట్రాల్, సోడియం శాతాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇది రక్తపోటును (బిపి) అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. పాలతో కలిసి ఇది గుండె పనితీరును మెరుగుపరిచి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుంది.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**

మఖానాలో ఉండే పీచు పదార్థం (ఫైబర్) మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. పాలు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచి, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తాయి. ఇది శరీర మెటబాలిజంను కూడా పెంచుతుంది.

**బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యానికి:**

ఈ ఆహారం తిన్న తర్వాత ఎక్కువ సమయం ఆకలి వేయకుండా కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన క్రేవింగ్స్ తగ్గి, బరువు సులభంగా అదుపులోకి వస్తుంది. అలాగే, మఖానాలోని యాంటీ ఏజింగ్ గుణాలు, పాలలోని హైడ్రేటింగ్ గుణాలు కలిసి ముడతలను తగ్గించి, చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి.

**కిడ్నీల ఆరోగ్యానికి రక్షణ:**

మఖానా సహజ డిటాక్సిఫైయర్‌గా పనిచేసి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది. పాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతూ, మూత్రపిండాలు (కిడ్నీలు) ఆరోగ్యంగా పనిచేసేలా చేస్తాయి. పోషకాల గని అయిన ఈ నానబెట్టిన మఖానాను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు.



# ప్రీతి మిస్ చేసుకున్న హీరోయిన్..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ పైన ఇప్పటికే మంచి హైప్ నెలకొంది.. ఈ క్రేజీ చిత్రానికి 'రాకా' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు చిత్రయూనిట్ ఇదివరకే ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదలైన టైటిల్ పోస్టర్ సైతం సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచేసింది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాలో ఒక ముఖ్యమైన పాత్ర కోసం యువ నటి ప్రీతి ముకుందన్‌ను మొదట సంప్రదించారని గతంలో వార్తలు వినిపించాయి. కానీ ఆమె ఈ ప్రాజెక్ట్ మిస్సైనట్లు ప్రచారం నడిచింది. తాజాగా ఈ విషయంపై డైరెక్టర్ అట్లీ స్పందించారు. నెట్టింట వినిపిస్తున్న రూమర్స్ పై క్లారిటీ ఇస్తూ.. డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్ల ఆమె ఈ భారీ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని అన్నారు. ఇటీవల జరిగిన తమిళ రొమాంటిక్ కామెడీ సినిమా 'హృదయం మురళి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు అట్లీ ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. "నేను ప్రీతి ముకుందన్ నటనకు పెద్ద అభిమానిని. నా డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'రాకా'లో ఒక కీలకమైన , ప్రాధాన్యత కలిగిన పాత్ర కోసం మొదట ఆమెనే సంప్రదించాను. కానీ ఆ సమయంలో ఆమె ఇతర ప్రాజెక్టులతో చాలా బిజీగా ఉండటం వల్ల మా సినిమాకు డేట్స్ కేటాయించలేకపోయింది. దాంతో ఆమె ఈ గోల్డెన్ ఛాన్స్‌ను మిస్ చేసుకోవాల్సి వచ్చింది" అని అట్లీ వివరించారు. ప్రీతి ముకుందన్ తిరస్కరించిన ఆ కీలక పాత్రను ప్రస్తుతం మలయాళ నటి ఫెమినా జార్జ్ (మిన్నల్ మురళి ఫేమ్) దక్కించుకున్నట్లు అట్లీ స్పష్టం చేశారు. అయితే ఆ పాత్ర స్వభావం ఎలా ఉంటుంది, సినిమాలో ఆమె ప్రాధాన్యత ఏమిటనే విషయాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు.




# ఓటీటీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ప్రతిష్ఠాత్మక చిత్రం పెద్ది ఎట్టకేలకు ఓటీటీలోకి అడుగుపెట్టింది. థియేటర్లలో ఘన విజయాన్ని అందుకున్న ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడమే కాకుండా, రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు ఎమోషనల్ టేకింగ్‌కు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంది. థియేటర్లలో తన ప్రయాణాన్ని విజయవంతంగా ముగించుకున్న 'పెద్ది' డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమా నేటి నుంచి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. దీంతో థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం లభించింది. అయితే ఓటీటీ విడుదలతో పాటు అభిమానులకు మేకర్స్ మరో స్పెషల్ సర్‌ప్రైజ్ కూడా అందించారు. థియేటర్లలో కనిపించని కొన్ని అదనపు సన్నివేశాలను ఓటీటీ వెర్షన్‌లో జోడించారు. సినిమా నిడివి కారణంగా తొలగించిన కొన్ని ఎమోషనల్, క్యారెక్టర్ బిల్డింగ్ సన్నివేశాలను ఇప్పుడు తిరిగి చేర్చడంతో కథ మరింత సంపూర్ణంగా అనిపిస్తోందని ఇప్పటికే చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ పాత్రకు సంబంధించిన కొన్ని కీలక క్షణాలు, భావోద్వేగ సన్నివేశాలు ఈ కొత్త వెర్షన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని అభిమానులు చెబుతున్నారు. 'పెద్ది' చిత్రంలో రామ్ చరణ్ గ్రామీణ యువకుడిగా కనిపించి మరోసారి తన నటనతో ఆకట్టుకున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, క్రీడా నేపథ్యం కలగలిపిన ఈ కథలో ఆయన నటనకు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. హీరోయిన్‌గా నటించిన జాన్వీ కపూర్ తన పాత్రలో చక్కటి అభినయాన్ని కనబరిచారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీత దిగ్గజం ఏ.ఆర్. రెహమాన్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన బలంగా నిలిచాయి. ముఖ్యంగా ఎమోషనల్ సన్నివేశాల్లో ఆయన ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరింత బలం చేకూర్చింది. అలాగే ప్రముఖ నటులు జగపతి బాబు , శివరాజ్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపించి మెప్పించారు. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగ కథనం, స్పోర్ట్స్ అంశాలు, అద్భుతమైన విజువల్స్‌తో 'పెద్ది' ప్రేక్షకులను ఆకట్టుకుంది. థియేటర్లలో మంచి విజయాన్ని నమోదు చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో కూడా అదే స్థాయిలో ఆదరణ పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పెళ్లి పీటలెక్కిన కలర్స్ స్వాతి..



కలర్స్ స్వాతిగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది స్వాతి రెడ్డి. క్యారెక్టర్ రోల్స్‌తోపాటు హీరోయిన్‌గా సూపర్ ఫ్యాన్ బేస్ ఖాతాలో వేసుకున్న ఈ ముద్దుగుమ్మ వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది. స్వాతి రెడ్డి దర్శకుడు, 'మంథ్ ఆఫ్ మధు' ఫేం శ్రీకాంత్ నగోటిను పెళ్లి చేసుకుంది. సంప్రదాయ పద్ధతిలో వివాహ వేడుక జరుగగా.. స్వాతి రెడ్డి తన భర్త చేయి పట్టుకున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ ఈ విషయాన్ని అభిమానులు, మూవీ లవర్స్‌తో షేర్ చేసుకుంది. ఇండస్ట్రీ స్నేహితులు, కోస్టార్లు, అభిమానులు కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న స్వాతికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. శ్రీకాంత్ నగోటి డైరెక్ట్ చేసిన రొమాంటిక్ డ్రామా 'మంథ్ ఆఫ్ మధు' లో స్వాతిరెడ్డి, నవీన్‌చంద్ర హీరోహీరోయిన్లుగా నటించారని తెలిసిందే. ఈ ప్రాజెక్టు తర్వాత కొత్త సినిమాలకేం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు స్వాతి.స్వాతి రెడ్డికి ఇది రెండో వివాహం. స్వాతి రెడ్డి మొదట తన బాయ్‌ఫ్రెండ్, మలయాళి పైలట్ వికాస్ వాసును 2018 ఆగస్టు 30న వివాహం చేసుకుంది. అయితే ఈ ఇద్దరు 2022లో విడాకులు తీసుకున్నారు.

# 'టాక్సిక్' మూవీ నుంచి మ్యూజిక్ వీడియో 'తబాహీ'




మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, జీ మ్యూజిక్ కంపెనీ కలిసి 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' సినిమాలోని తొలి పాట 'తబాహీ' అఫీషియల్ మ్యూజిక్ వీడియోను విడుదల చేశాయి. ఆడియో విడుదలైనప్పటి నుంచే చార్ట్‌బస్టర్‌గా నిలిచిన ఈ పాటకు ఇప్పుడు విజువల్ రూపం రావడంతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'తబాహీ' మ్యూజిక్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే ఆడియోతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ పాట, ఇప్పుడు అద్భుతమైన విజువల్స్‌తో మరింత ప్రత్యేకంగా నిలిచింది. భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'టాక్సిక్' ప్రపంచాన్ని తొలిసారి ఈ మ్యూజిక్ వీడియో పరిచయం చేస్తోంది. రాకింగ్ స్టార్ యశ్, కియారా అద్వానీ తొలిసారి జంటగా కనిపిస్తున్న ఈ పాటలో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రేమను అత్యంత స్వచ్ఛంగా, గాఢంగా చూపించిన ఈ పాట, అద్భుతమైన విజువల్స్, భావోద్వేగాలతో కూడిన కథనం, పవర్‌ఫుల్ గిటార్ అరేంజ్‌మెంట్స్, గ్రాండ్ ఆర్కెస్ట్రాతో ఆకట్టుకుంటోంది. ఈ మ్యూజిక్ వీడియో 'టాక్సిక్' సినిమాలోని ప్రత్యేకమైన ప్రపంచానికి చక్కని పరిచయంగా నిలుస్తోంది. మ్యూజిక్ వీడియో విడుదలకు ముందు మేకర్స్ సోషల్ మీడియాలో ఆసక్తికరమైన ప్రమోషన్ చేశారు. జూలై 7న 'టాక్సిక్' అధికారిక సోషల్ మీడియా ఖాతా నుంచి "దొంగచాటుగా మాత్రమే బతికే ప్రేమను ఏమంటారు?" అంటూ ప్రశ్నిస్తూ కియారా అద్వానీని ట్యాగ్ చేశారు. దీనికి కియారా ఒక్క మాటతో "తబాహీ" అని సమాధానం ఇచ్చారు. వెంటనే జీ మ్యూజిక్ కంపెనీ "స్టే ట్యూన్డ్..." అంటూ స్పందించడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. విశాల్ మిశ్రా స్వరపరచి, ఆలపించిన ఈ పాటకు హిందీలో రాజ్ శేఖర్ సాహిత్యం అందించారు. ఈ పాటను హిందీతో పాటు కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో కూడా విడుదల చేశారు. ఆయా భాషలకు యోగరాజ్ భట్ (కన్నడ), రామజోగయ్య శాస్త్రి (తెలుగు), విగ్నేష్ శివన్ (తమిళం), రఫీక్ అహ్మద్ (మలయాళం) సాహిత్యం అందించడం విశేషం. ఈ మల్టీలాంగ్వేజ్ విడుదలతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోవాలనే సినిమా లక్ష్యం మరోసారి స్పష్టమైంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు, గాయకుడు విశాల్ మిశ్రా మాట్లాడుతూ, "'తబాహీ' సాధారణ ప్రేమగీతం కాదు. ప్రేమలోని త్యాగం, ఆవేశం, భావోద్వేగాలను ఈ పాట చూపిస్తుంది. 'టాక్సిక్' కోసం అలాంటి ఇంటెన్స్ మోసుకెళ్లే సంగీతం కావాలి. యశ్ తెరపై చూపించే ఎనర్జీకి తగ్గట్టుగా సంగీతాన్ని అందించడానికి ప్రయత్నించాను. ప్రేమ మనల్ని ఓదార్చే ముందు పూర్తిగా ముంచెత్తే భావనను ఈ పాటలో చూపించాలనుకున్నాను" యశ్, గీతూ మోహన్‌దాస్ కలిసి కథ అందించిన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరించగా, తెలుగు, హిందీ, తమిళం, మలయాళంతో పాటు ఇతర భాషల్లో కూడా డబ్ చేసి విడుదల చేయనున్నారు.

# ట్రెండీ దుస్తుల్లో మతిపోగోడుతున్న జాన్వీ..




సూపర్ స్టార్ కృష్ణ నట వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆ ఫ్యామిలీ నుంచి మూడో తరం రెడీ అవుతోంది. ఇప్పటికే మహేష్ బాబు స్టార్ హీరోగా రాణిస్తుండగా ఆయన కూతురు సితార ఘట్టమనేని ఇప్పటికే యాడ్స్ లో నటిస్తూ బిజీ బిజీగా ఉంటోంది. ఇక గౌతమ్ కూడా తెరంగేట్రానికి రెడీ అవుతున్నాడు. అతను ఇప్పటికే మహేష్ నటించిన వన్.. నేనొక్కడినే సినిమాలో కనిపించాడు. ఇక కృష్ణ సోదరుడు, దివంగత రమేశ్ బాబు తనయుడు జయ కృష్ణ హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. అతను హీరోగా నటించిన శ్రీనివాస మంగాపురం సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక వీరితో పాటు మహేష్ బాబు మేనకోడలు, మంజుల గారాల పట్టి జాన్వీ స్వరూప్ కూడా త్వరలోనే కెమెరా ముందుకు రానుంది. ఆమె తెరంగేట్రం గురించి ఇప్పటికే మంజులనే స్వయంగా ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీనికి సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పక్కాగా జరుగుతున్నాయి. కాగా సినిమాల కంటే ముందు సోషల్ మీడియాలో బాగా ఫేమస్ అవుతోంది జాన్వీ. తన గ్లామరస్ ఫొటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తూ ఫాలోవర్లను పెంచుకుంటోంది. తాజాగా మరికొన్ని అందమైన ఫొటోలను షేర్ చేసింది జాన్వీ. ఈ ఫొటోల్లో లైట్ ఎల్లో కలర్ క్రాప్ ట్యాంక్ టాప్, దానికి పర్ఫెక్ట్ మ్యాచ్ అయ్యేలా ఎమరాల్డ్ గ్రీన్ కలర్ జోగర్ ప్యాంట్స్ ధరించి ట్రెండీగా మెరిసిపోయింది జాన్వీ. మరీ ముఖ్యంగా ఆమె టాప్ పై ఉన్న 'అవుట్ ఆఫ్ మై మైండ్ ప్లీజ్ లీవ్ ఎ మెసేజ్' అనే స్లోగన్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**